18వ వసంతంలోకి
నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com
చిత్తూరు | తిరుపతి
బుధవారం | 19 మార్చి 2025 | పేజీలు 9

## రేపు తిరుమలకు సీఎం నారా చంద్రబాబు నాయుడు రాక

**తిరుపతి బ్యూరో, మేజర్‌న్యూస్:** ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గురువారం తిరుమలకు రావడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ పేర్కొన్నారు. మంగళవారం సాయంత్రం రేణిగుంట విమానాశ్రయం నందు జిల్లా ఎస్పీ హర్ష వర్ధన్ రాజు, ఎయిర్ పోర్ట్ డైరెక్టర్ డి.భూమినాధన్‌తో కలిసి ముందస్తు భద్రత లైజన్‌లో భాగంగా జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులతో ముఖ్యమంత్రి పర్యటన భద్రత ఏర్పాట్లపై సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ తిరుపతి, తిరుమల పర్యటన సందర్భంగా ఎలాంటి చిన్న పొరపాట్లకు తావులేకుండా సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేసి ముఖ్యమంత్రి పర్యటనను వంతం చేయాలన్నారు.



గురువారం రాత్రి 9.30గంటలకు రేణిగుంట విమానాశ్రయం చేరుకుని అక్కడి నుండి రోడ్డు మార్గాన తిరుమల శ్రీపద్మావతి అతిథి గృహం చేరుకుంటారని తెలిపారు. శుక్రవారం ఉదయం శ్రీవారిని దర్శించుకుని అనంతరం తిరిగి మధ్యాహ్నం 2 గంటలకు తిరుమల నుండి బయలుదేరి రేణిగుంట విమానాశ్రయం చేరుకొని తిరుగుప్రయాణం కానున్నారని తెలిపారు. వైద్య ఆరోగ్య శాఖ వారు ప్రత్యేక డాక్టర్లు, అధునాతన లైఫ్ సపోర్ట్

మిగతా 2లో

### ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అర్జీలను

## గడువులోగా పరిష్కరించాలి

**రీఓపెన్ కేసులపై ప్రత్యేక దృష్టి పెట్టాలి: కలెక్టర్ డా. ఎస్.వెంకటేశ్వర్**



**తిరుపతి బ్యూరో, మేజర్‌న్యూస్:** ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన అర్జీలను గడువులోగా సంతృప్తి స్థాయిలో పరిష్కారం చూపాలని సంబంధిత జిల్లా అధికారులను కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్ ఆదేశించారు. మంగళవారం సాయంత్రం స్థానిక కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నందు ప్రజా సమస్యల పరిష్కార వేదికపై జాయింట్ కలెక్టర్ శుభంబన్సల్, జిల్లా రెవెన్యు అధికారి నరసింహులు, జిల్లా అధికారులతో కలిసి జిల్లా కలెక్టర్ డా.ఎస్ వెంకటేశ్వర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కార వేదికకు అధిక ప్రాధాన్యత ఇస్తుందని, అర్జీలకు సంతృప్తి స్థాయిలో నాణ్యమైన పరిష్కారం చూపాలని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న అర్జీలను ప్రణాళిక బద్ధంగా సంబంధిత అధికారులు పరిష్కారం చూపాలన్నారు. క్షేత్ర స్థాయిలో స్వయంగా వెళ్లి పారదర్శకంగా విచారణ చేసి అర్జీదారుడు సంతృప్తి చెందేలా నిర్ణీత గడువులోపు పరిష్కరించాలన్నారు. అర్జీదారులు వారి సమస్యకు పరిష్కార దిశగా గ్రీవెన్స్ రావడం జరుగుతుందని సంబంధిత అధికారులు

మిగతా 2లో







## విద్యుత్ శాఖలో వైసీపీ హవా

**అప్పటి మహిళా మంత్రి అండతో అవినీతి దందా చెలాయించిన అధికారికే పగ్గాలు...**

**కూటమి ప్రభుత్వంలో ఎస్(ఈ)సీ అధికారిని తప్పించిన దైన్యం...**

**సంవత్సరం దాటిపోయినా అధికారి అవినీతిపై నోరు మెదపని ఉన్నతాధికారులు**

**తిరుపతి కార్పొరేట్ కార్యాలయంలో ఏం జరుగుతోంది..?**

**వైసీపీకి చెందినవారు ఎవరైనా కావచ్చు.. ఏ స్థాయిలో కూడా వారికి కూటమి ప్రభుత్వం ద్వారా సహకారం అందించకూడదన్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వ్యాఖ్యలు ఇక్కడ పెడచెవిన పెట్టారు. వైసీపీ సానుభూతి అధికారిగా పేరుపొంది.. అప్పటి స్థానిక మహిళా మంత్రి అనుయాయునిగా పత్రికలకెక్కిన ఈ అధికారికి అనంతపురం విద్యుత్ శాఖ ఉన్నత బాధ్యతలు అప్పగించడంలో చక్రం తిప్పిన వారి వ్యవహారాన్ని.. ఈ అధికారి గతంలో చేసిన అవినీతి అక్రమాలను మరోసారి పాఠకుల ముందుకు తీసుకొస్తుంది.. నేటి దినపత్రిక సూర్య.**

సహజంగా ప్రభుత్వ శాఖల్లో అవినీతి అక్రమాలు చోటు చేసుకుంటే వారిపై ఉన్నతాధికారులు శాఖా పరమైన చర్యలు తీసుకుంటారు. అయితే విద్యుత్ శాఖలో మాత్రం తద్విరుద్ధంగా ఎంత అవినీతి చేస్తే అంత అందలం అన్న చందంగా వ్యవహారం నడుస్తోంది. ఔను.. మీరు చదువుతున్నది ముమ్మాటికి నిజమే. అసలు విషయానికొస్తే...

**తిరుపతి, మేజర్‌న్యూస్ :**

2023లో కళ్యాణదుర్గంలో ఈఈగా పని చేసిన ఆ అధికారికి అప్పటి స్థానిక మహిళా మంత్రి అన్ని విధాలుగా అండగా నిలిచారు. అంతకు ముందు అవినీతి ఆరోపణలు ఎదుర్కొని చిత్తూరు జిల్లాకు బదిలీ అయిన ఆయనను పట్టుపట్టి మరీ కళ్యాణదుర్గంకు తెచ్చుకున్నారు. ఇక అప్పటి మంత్రి అండదండలతో ఆ అధికారి అవినీతి అక్రమాల్లో చెలరేగిపోయారు. ప్రధాన పత్రికల్లో ఈ అధికారి అవినీతి అక్రమాలపై అనేక కథనాలు వచ్చాయి. అయినా ఆయన హవా తగ్గలేదు.

**విద్యుత్ శాఖలో ఇప్పటికీ వైసీపీ హవా.. కూటమి ప్రభుత్వంలో ఎస్(ఈ)సీ అధికారిని తప్పించిన దైన్యం..**

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పది నెలలు పూర్తయినప్పటికీ విద్యుత్‌శాఖలో మాత్రం వైసీపీ హవానే కొనసాగుతోంది. వైసీపీ హయాంలో అవినీతి అధికారిగా పత్రికలకు

మిగతా 2లో

## నిప్పు రగిలితే.. ఆర్పేదెవరు సారూ..?

**వేధిస్తోన్న సిబ్బంది కొరత**

**సంఘటన జరిగిన సమయాల్లో నాయకులు, అధికారులు కంటి తుడుపు చర్యలు**



**ప్రతి ఏటా అగ్ని ప్రమాదాల్లో కోట్లాది రూపాయల ఆస్తులు బుగ్గిపాలవుతున్నాయి**

**తిరుపతి జిల్లాలో 12 అగ్నిమాపక కేంద్రాలు ఉన్నాయి**

**తిరుపతి అగ్నిమాపక కేంద్రంలో మాత్రమే 54 మీటర్ల ఎత్తులో ఫైర్ చేసే వాహనం ఉంది**

**తిరుపతి బ్యూరో, మేజర్‌న్యూస్:**

ఎండా కాలం.. అంటే మండే కాలం. అగ్ని ప్రమాదాలకు అత్యధికంగా ఉన్నసమయం. భానుడి భగలకు తోడు అగ్గి సులభంగా రేగుతుంటోంది. ఏటా అగ్ని ప్రమాదాల్లో రూ.కోట్లలో ఆస్తి నష్టంతో పాటు ప్రాణాలు కూడా పోతుంటాయి. అగ్ని ప్రమాదాల నివారణకు అత్యాధునిక యంత్రపరికరాలు అందుబాటులోకి వచ్చిన వాటిని అందిపుచ్చు కోవడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందనేందుకు తిరుపతి జిల్లాలోని

మిగతా 8లో

## అంతర్ జిల్లా దొంగల ముఠా అరెస్ట్

**రూ.35లక్షల విలువ గల బంగారు, వెండి ఆభరణాలు స్వాధీనం**

**రెండు ద్విచక్ర వాహనాలు, ఒక టీవీ సీజ్**


**జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు వెల్లడి**

**చిత్తూరు క్రైం, మేజర్‌న్యూస్:** అంతర్ జిల్లా దొంగల ముఠాను పూతలపట్టు పోలీసులు అరెస్టు చేశారు. ఈ మేరకు మంగళవారం నగరంలోని స్థానిక పోలీసు అతిధి భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అంతర్ జిల్లా దొంగల ముఠాకు చెందిన ఐదుగురు దొంగలను, చోరీకి గురైన బంగారు, వెండి ఆభరణాలను పోలీసులు మీడియా ముందు హాజరు పరిచారు. జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు విలేకరులతో మాట్లాడుతూ ఈనెల 6వ తేదీన పూతలపట్టు మండలంలో



జరిగిన ద్విచక్ర వాహన దొంగతనం కేసులో బాధితుడి ఫిర్యాదు మేరకు పూతలపట్టు ఇన్స్పెక్టర్ కృష్ణ మోహన్ కేసు నమోదు చేశారని పేర్కొన్నారు. ఆ క్రమంలో చిత్తూరు డీఎస్పీ సాయినాథ్ పర్యవేక్షణలో కేసు దర్యాప్తు బాగంగా సోమవారం రాబడిన సమాచారం మేరకు పూతలపట్టు మండలం పి.కొత్తకోట పాత రోడ్డులో

మిగతా 8లో



**రంజాన్ వేళలు**

ఇఫ్తార్ : 6.25 (బుధవారం)

సెహరి : 5.02 (గురువారం)

## ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అర్జీలను గడువులోగా పరిష్కరించాలి

(మొదటి పేజీ తరువాయి)

అర్జీదారునితో స్వయంగా మాట్లాడి వారి సమస్యలను సావధానంగా విని సంతృప్తి స్థాయిలో పరిష్కారం చూపాలన్నారు. పి4 సర్వే ప్రక్రియలో భాగంగా ఎంపిడిఓ లు, మున్సిపల్ కమీషనర్ లు ప్రత్యేక దృష్టి పెట్టి వెనుకబడిన గ్రామాలలో సర్వే ప్రక్రియ ను త్వరిత గతిన పూర్తి చేయాలని తెలిపారు. ఈ నెల 24, 25 వ తేదీలలో కలెక్టర్ల కాన్ఫరెన్స్ జరగనున్న నేపథ్యంలో జిల్లా ప్రగతి పైన సంబంధిత జిల్లా అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో డిపిఓ సుశీలా దేవి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రోస్మాండ్, డిఆర్డిఏ పిడి శోభన్ బాబు డ్వామా పిడి శ్రీనివాస్ ప్రసాద్, డిఎం అండ్ హెచ్ ఓ బాలకృష్ణ నాయక్, సంబంధిత జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## ఘనంగా బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు జన్మదిన వేడుకలు



**గూడూరు, మేజర్‌న్యూస్:** భారతీయ జనతా యువమోర్చా రాష్ట్ర అధ్యక్షులు మిట్ట వంశి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. గిద్దలూరు మనోజ్ కుమార్ మాట్లాడుతూ చిన్నతనం నుండి ఆర్ఎస్ఎస్‌లో పనిచేసి ప్రజలకు నిత్యం అండగా నిలవాలని ఆశయంతో మిట్టవంశి రాజకీయాల్లోకి రావడం జరిగిందన్నారు. బీజేవైఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా గతంలో ప్రజా సమస్యలను పరిష్కరించి ప్రజల పక్షాన్ని నిలిచారని తెలిపారు. బీజేవైఎం ఆధ్వర్యంలో వృద్ధాశ్రమంలో కేక్ కట్ చేసి వృద్ధులకు పండ్లు పంపిణీ చేయడం మంచి కార్యక్రమం అని వంశీకృష్ణ అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం నగర అధ్యక్షులు శివశంకర్ నగర ప్రధాన కార్యదర్శి ప్రణయ్, బీజేవైఎం నాయకులు రాజేష్, గురు, చరణ్ తేజ ,ప్రదీప్, నవీన్ పాల్గొన్నారు.

## రైతులకు మామిడి కవర్లను 50 శాతం రాయితీ



**శాంతిపురం, మేజర్‌న్యూస్:** శాంతిపురం, గుడిపల్లి మండలంలోని మామిడి రైతులకు మామిడి కవర్లను 50% సబ్సిడితో ఉద్యాన శాఖ వారు అందజేస్తున్నారు. కవరు మొత్తం ధర రెండు రూపాయలు కాగా ఒక రూపాయికి అందజేస్తున్నారు. కాయలు పెద్ద నిమ్మకాయ సైజు వచ్చినప్పుడు కవర్లను కట్టాలి. కవర్లను కట్టడం వలన పురుగు ఉధృతి తగ్గి కాయ నాణ్యతనుపెరుగుతుంది. దీనివలన మార్కెట్లో మంచి ధర లభిస్తుంది. మామిడి కాయనాణ్యతను పెంచేందుకు రైతులు కాయలను కవర్లను కట్టాలి. కవర్లు కట్టడం వలన కాయ మీద పురుగు ఉధృతి తగ్గి నాణ్యత పెరుగుతుంది. దీని వలన మార్కెట్‌లో మంచి ధర లభిస్తుంది. మామిడి కవర్లు అవసరమైన రైతులు వారి దగ్గరలో ని రైతు సేవా కేంద్ర సిబ్బందిని గాని ఉద్యాన అధికారిని కానీ సంప్రదించాలి. ఒక్కొక్క రైతుకు గరిష్టంగా 2.5 ఎకరాలకు 10000 కవర్లు తీసుకోవచ్చు. శాంతిపురం మరియు గుడిపల్లి మండల రైతులకు కవర్లు తుంసి దగ్గర అబకలదొడ్డి రైతు సేవ కేంద్రంలో అందుబాటులో ఉంటాయని, వివరాల కొరకు 7995086952కు సంప్రదించ గలరని శాంతిపురం మండల ఉద్యాన అధికారి వింధ్య తెలిపారు.

## తడి పొడి చెత్తను వేరు చేయాలి



**పెళ్లకూరు మేజర్‌న్యూస్:** తడిచెత్తను పొడిచెత్తను వేర్వేరుగా వేసే విధంగా ప్రజలను చైతన్య వంతం చేయాలని డిఎల్పిఓ రవీంద్ర బాబు అన్నారు. మండలంలోని తల్వాయి పాడు పంచాయతీ నందు తడి చెత్త పొడి చెత్తను ఆయన పరిశీలించారు. వారు మాట్లాడుతూ ప్రతి ఇంటి నందు తడి చెత్త పొడి చెత్త వేరు చేసి గ్రీన్ అంబాసి డర్స్‌కు ఇవ్వాలన్నారు. అదేవిదంగా పంచాయతీ ప్రజలకు ఐవిఆర్ ఎస్ కాల్స్ గురించి అయన అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీ హరి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## పట్టం కార్తీక్ యాదవ్‌కు ఘన సన్మానం



**శ్రీకాళహస్తి మేజర్‌న్యూస్:** శ్రీకాళహస్తి నియోజకవర్గం మాజీ శాసన సభ్యులు బియ్యపు మధుసూదన్ రెడ్డిని వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ శ్రీకాళహస్తి నియోజకవర్గం స్టూడెంట్ వింగ్ అధ్యక్షులుగా నియమితులైన పట్టం కార్తీక్ యాదవ్ తన అనుచరులతో కలిసి పట్టణ వైఎస్ఆర్ కాంగ్రెస్‌పార్టీ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. బియ్యపు మధుసూదన్ రెడ్డికి సాలువ కప్పి,భారీ గజమాల వేసి పుష్పగుచ్చం అందజేసి ఆశీస్సులు తీసుకున్నారు. అనంతరం కార్తీక్ యాదవ్ మాట్లాడుతూ తన మీద నమ్మకంతో శ్రీకాళహస్తి నియోజకవర్గం స్టూడెంట్ వింగ్ అధ్యక్ష పదవిని ఇచ్చిన బియ్యపు మధుసూదన్ రెడ్డి నమ్మకాన్ని వమ్ము చేయకుండా విద్యార్థులు సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాటం చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి చిత్తూరు జిల్లా ప్రధాన కార్యదర్శి ఉన్నం వాసుదేవ్ నాయుడు, కిషోర్ రెడ్డి, దేవస్థానం మాజీ బోర్డు మెంబర్ బుల్లెట్ జయశ్యామ్ రాయల్, మునిరత్నం నాయుడు, పల్లాం కుమార్, రవి పాల్గొన్నారు.

# రేపు తిరుమలకు సీఎం నారా చంద్రబాబు నాయుడు రాక

(మొదటి పేజీ తరువాయి)

అంబులెన్స్ ఏర్పాట్లు చేయాలని వైద్యశాఖ అధికారులను ఆదేశించారు, ఫైర్ సేఫ్టీ,శానిటేషన్, కాన్వాయ్ వాహనాలు తదితరాల ఏర్పాటుపై సమీక్ష నిర్వహించారు. విధులు కేటాయించిన అధికారులు ఎలాంటి అలసత్వం లేకుండా పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ లు రవిమనోహర్చారి,బి.నాగభూషన్ రావ్, ఆర్డీవో శ్రీకాళహస్తి భాను ప్రకాష్ రెడ్డి, డిఎంహెచ్ఓ బాలాజీ నాయక్, జిల్లా ఫైర్ అధికారి రమణయ్య, ఎయిర్పోర్ట్ అధికారులు, తహశీల్దార్ సురేష్ బాబు పాల్గొన్నారు.



## విద్యుత్ శాఖలో వైసీపీ హవా...

### తిరుపతి కార్పొరేట్ కార్యాలయంలో ఏం జరుగుతోంది..

» మొదటి పేజీ తరువాయి

ఎక్కిన కళ్యాణ్ దుర్గం ఈఈ కి పదోన్నతి ఇచ్చి మరి అందలం కట్టబెట్టారు. అప్పటి స్థానిక మహిళా మంత్రి అండ దండలతో చెలరేగిపోయిన ఈ అధికారిని అప్పటికే అనంతపురం విద్యుత్ శాఖ ఉన్నతాధికారిగా ఉన్న ఎస్ (ఈ )సి అధికారిని తప్పించి మరి ఈయనకు పగ్గాలు కట్ట పెట్టడం వెనక ఆంతర్యమేమిటో నేటి దినపత్రిక సూర్య నిశిత పరిశీలనతో నిగ్గు తేల్చబోతోంది.

అనంతపురం జిల్లా విద్యుత్ శాఖను అజమాయిషి చేయాల్సిన తిరుపతి కార్పొరేట్ కార్యాలయంలో ఏం జరుగుతుందో అంతు పట్టడం లేదు. అవినీతి అధికారుల భరతం పట్టాల్సింది పోయి.. వారికే అందలం కట్టబెట్టడం ఏమిటన్న ప్రశ్నలకు సమాధానాలు మృగ్యమయ్యాయి. తిరుపతి కార్పొరేట్ కార్యాలయంలో అనంతపురం జిల్లా వ్యవహారాలన్నిటిని ఆపరేట్ చేస్తున్న ఆ రిమోట్ ఎవరో త్వరలో పాఠకుల ముందుకు తీసుకొస్తాం.

## ఎన్టీఆర్ కాలనీ ఇంటి స్థలం సర్వే



**గూడూరు, మేజర్‌న్యూస్:** తొణుకుమాల గ్రామంలో ఎన్టీఆర్ గృహ కల్ప పథకంలో లబ్ధిదారుల ఇంటి స్థలాలు పరిశీలించారు. బుశారం జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు మండల బీసీ సెల్ అధ్యక్షులు మేకల కుమార్, తొణుకుమాల గ్రామ సర్పంచ్ బొమ్మిళ్ల త్రివిక్రమ్, ఉప సర్పంచ్ అరిపినేటి విజయభాస్కర్, గ్రామ పార్టీ అధ్యక్షులు రాగి చంద్రయ్య, మదనం బేటి భీమాచారి, గ్రామ కార్యదర్శి కావాలి వెంకటరమణ, బూత్ కన్వీనర్ గోవిందు సురేష్, వినయ్ మొగిలి గుంట, మొగిలి గుంట మస్తానయ్య, వీఆర్వో శ్రీనివాసులు, గ్రామ ప్రజలు పాల్గొని విజయవంతం చేశారు.

## మాతా పరమేశ్వరికి ప్రత్యేక పూజలు



**గూడూరు, మేజర్‌న్యూస్:** గూడూరు మండల పరిధిలోని చెన్నూరు గ్రామం అరుంధతి వాడలో వెలసియున్న మాత పరమేశ్వరికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామస్తులు గత మూడు రోజులుగా చద్ది కార్యక్రమాన్ని నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక పుష్పాలంకరణ చేసి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి దాతగా ఎం.ఆర్.పి.ఎస్ రాష్ట్ర కార్యదర్శి గోవిందు శంకరయ్య వ్యవహరించారు. అనంతరం భక్తులు అమ్మ వారిని దర్శించుకొని, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

## కనుపూరు ముత్యాలమ్మ జాతర కమిటీ మెంబర్‌గా రమేష్ బాబు

### పలువురు అభినందనలు

**కోట, మేజర్‌న్యూస్:** కోట మండలానికి చెందిన సీనియర్ బిజెపి నాయకులు, కోట మండల మాజీ బీజేపీ అధ్యక్షులు సారంగం రమేష్ బాబు ను తూర్పు కనుపూరు ముత్యాలమ్మ దేవస్థాన కమిటీ మెంబర్గా నియమించబడ్డారు. ఎండోమెంట్ కమిషనర్ కోట మండలానికి చెందిన సారంగం రమేష్ బాబు, చిల్లకూరు దశరథరామిరెడ్డి మారాణి సుబ్రహ్మణ్యం లను దేవస్థాన నూతన కమిటీ మెంబర్స్ గా నియమించారు. ఈనెల 25 నుంచి జరగనున్న కనుపూరు ముత్యాలమ్మ జాతర మహోత్సవం నుంచి దేవస్థానానికి వీరు సేవలు అందించనున్నారు. గత మూడు దశాబ్దాలుగా భారతీయ జనతా పార్టీకి విశేష సేవలు అందిస్తూ పార్టీకి అంకితభావంతో పనిచేస్తున్న సారంగం రమేష్ బాబు ఆలయ కమిటీ మెంబర్గా ఎంపిక కావడం పట్ల రమేష్ బాబుకు ఈ సందర్భంగా పరువులు అభినందనలు తెలిపారు. 1996 భారతీయ జనతా పార్టీలో రంగ ప్రవేశం చేసిన రమేష్ బాబు భారతీయ జనతా పార్టీ కోట మండల ప్రధాన కార్యదర్శిగా ఆరంగ్రేటం చేశారు. 1999, 2006 సంవత్సరాలలో రెండు పర్యాయాలు కోట మండల బిజెపి అధ్యక్షులుగా పని చేశారు. 2003, 2009లో, కోట మండల ఉపాధ్యక్షులుగా సమర్ధవంతంగా బాధ్యతలు నిర్వహించారు. జిల్లా కార్యవర్గ సభ్యులుగా, రాష్ట్ర సభ్యులుగా సమర్ధవంతంగా నిజాయితీగా బాధ్యతలు నిర్వహించారు. 2021 నుంచి 24 వరకు కోట మండలం అధ్యక్షత బాధ్యతలు నిర్వహించడమే కాకుండా కోట మండలంలో భారతీయ జనతా పార్టీ బలోపేతానికి విశేష కృషి కృషి చేసినందుకు గుర్తింపుగా కనుపూరు ముత్యాలమ్మ దేవస్థానం కమిటీ మెంబర్గా పార్టీ అధిష్టానం నియమించింది. రమేష్‌బాబు మాట్లాడుతూ తనపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతలను నిజాయితీగా నిర్వర్తిస్తానని పేర్కొన్నారు. తన ఈ పదవి రావడానికి కృషిచేసిన ప్రతి ఒక్కరికి అభినందనలు తెలుపుతామన్నారు. రమేష్ బాబును తిరుపతి జిల్లా బిజెపి అధ్యక్షుడు చంద్రప్ప, గిరిధర్ రెడ్డి, సీనియర్ బిజెపి నాయకులురాజారాం అభినందన తెలిపారు. మండలంలోని బిజెపి నాయకులు కార్యకర్తలు అభినందనలు తెలిపారు.



## ఎమ్మెల్యేను కలిసిన మాజీ జడ్పీటీసీ దంపతులు

**చిట్టమూరు, మేజర్‌న్యూస్:** గూడూరు శాసనసభ్యులు డాక్టర్ పాశిం సునీల్ కుమార్ ను చిట్టమూరు మాజీ జడ్పిటిసి సభ్యురాలు దువ్వూరు భారతమ్మ, చిట్టిరెడ్డి దంపతులు మంగళవారం కలిశారు. విజయవాడలోని



ఇందిరగాంధీ మైదానంలో నిర్వహిస్తున్న ఆంధ్రప్రదేశ్ శాసన సభ్యుల క్రీడల–2025 పోటీలలో పాల్గొన్న డాక్టర్ పాశిం సునీల్ కుమార్ ను కలిసి అభినందనలు తెలియజేశారు. మండలంలోని పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లిన వారు పరిష్కరించాలని కోరినట్లు కూడా మేజర్‌న్యూస్‌కు తెలిపారు.

## ఎమ్మెల్సీకి వినోద్ కుమార్ రెడ్డి శుభాకాంక్షలు

**కోట, మేజర్‌న్యూస్:** శాసన మండలి సభ్యులుగా ఎన్నికైన బీద రవిచంద్రను కోట మాజీ ఎంపీపీ నల్లపరెడ్డి వినోద్ కుమార్ రెడ్డి కలిసి శుభాకాంక్షలు తెలిపారు. తెలుగు దేశం పార్టీ సీనియర్ నాయకులు బీద రవిచంద్ర ఇటీవల ఎమ్మెల్యేల కోటాలో ఎమ్మెల్సీగా ఏకగ్రీవంగా ఎన్నికైన విషయం తెలిసిందే. ఈ



క్రమంలో మంగళవారం నల్లపరెడ్డి వినోద్ కుమార్ రెడ్డి విజయవాడలోని మినర్వాగ్రాండ్ హోటల్‌లో రవిచంద్రకు పుష్పగుచ్చం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. నల్లపరెడ్డి వినోద్ కుమార్ రెడ్డిని ఎమ్మెల్సీ రవిచంద్ర ఆప్యాయంగా పలకరించారు.

## మనమంతా స్విమ్స్ అభివృద్ధికి పాటుపడదాం

### బాధ్యతలు చేపట్టిన నూతన కార్యవర్గం

**తిరుపతి, మేజర్‌న్యూస్ ప్రతినిధి:** నూతనంగా ఎన్నికైన స్విమ్స్




ఉద్యోగుల నూతన కార్యవర్గం స్విమ్స్ అభివృద్ధి కోసం మనమంతా కలిసికట్టుగా పాటు పడదామని స్విమ్స్ డిప్యూటీ రిజిస్ట్రార్ ఎర్రంరెడ్డి తెలిపారు. స్విమ్స్ ఆడిటోరియంలో మంగళవారం స్విమ్స్ ఎంప్లాయిస్ అసోసియేషన్ నూతన కార్యవర్గం బాధ్యతలు చేపట్టారు. ఎర్రం రెడ్డి మాట్లాడుతూ గత కార్యవర్గం కన్నా మరింత చురుకైనపాత్ర పోషించి అటు ఉద్యోగుల సంక్షేమంతో పాటు సుదూర ప్రాంతాల నుంచి రోగులకు మెరుగైన వైద్యం అందించేలా తమవంతుగా కృషి చేయాలన్నారు. అనంతరం సిమ్స్ ఉద్యోగుల అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వి.బాబు సురేష్, పి.రామమూర్తిలు మాట్లాడుతూ తమను నూతన కార్యవర్గంలో చోటు కల్పించడం పట్ల స్విమ్స్ ఉద్యోగ సంఘం సభ్యులందరికీ పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. సిమ్స్‌లో పని చేసే ఉద్యోగులకు ఏ సమస్యవచ్చినా మన అసోసియేషన్ ఎప్పుడు ఎల్లప్పుడూ ముందు ఉంటుందని చెప్పారు. ఏదైనా ఒక సమస్య వస్తే ఆ సమస్య పరిష్కరించే దాకా పట్టు వదలని విక్రమార్కుడిలాగా మీ అందరి సహకారంతో ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే దిశగా చొరవ చూపుతామన్నారు. సిమ్స్‌కు రాయలసీమ జిల్లాల నుండే కాకుండా రాష్ట్ర నలుమూలల నుండి రోగులు వైద్యం కోసం వస్తున్నారని వారందరిని ప్రేమ పూర్వకంగా ఆదరించి మెరుగైన వైద్యం అందేలా చొరవ చూపుతామన్నారు. కోశాధికారి గోవర్ధన్ మాట్లాడుతూ త్వరలో జమా ఖర్చుల నివేదికలను అసోసియేషన్ ముందు ఉంచుతామన్నారు. అసోసియేషన్ గౌరవ అధ్యక్షులుగా డిప్యూటీ డైరెక్టర్ సురేష్ ను ఎంపిక చేశారు. ఈ సమావేశంలో ఉపాధ్యక్షులు శివయ్య, జాయింట్ సెక్రటరీలుగా రూపా నాయక్, సురేష్ కుమార్ రెడ్డి, రమాదేవి, ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఎన్ఎస్ఆర్ మురళీకృష్ణ, కమ్యూనికేషన్ సెక్రటరీగా హరిప్రసాద్ రెడ్డిల, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

## ఇంటర్న్‌షిప్ ఉద్యోగ అవకాశాలపై అవగాహన

**పుంగనూరు, మేజర్‌న్యూస్:** పట్టణ పరిధిలోని శుభారాం డిగ్రీ కళాశాలలో మంగళవారం ఉపప్రధాన ఆచార్యులు శ్రీనివాసులు ఆధ్వర్యంలో శ్రీసిటీలో స్వల్పకాల, దీర్ఘకాల ఇంటర్న్‌షిప్ ఉద్యోగ అవకాశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# రేషన్ కార్డు సభ్యులకు ఈకేవైసీ తప్పనిసరి

**పెద్దపంజాణి, మేజర్‌న్యూస్:** మండలంలోని రేషన్ కార్డులోని ప్రతి సభ్యునికి ఈకేవైసీ తప్పనిసరిగా చేయించాలని పెద్దపంజాణి తహసిల్దార్ సి.ఎస్.అనిల్ కుమార్ తెలిపారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో మండలంలోని రేషన్ డీలర్లతో తాసిల్దార్ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రేషన్ కార్డులోని ప్రతి సభ్యునికి ఈ కేవైసీ చేయాలని డీలర్లకు సూచించారు. ఈ కేవైసీ చేయని సభ్యులకు ఉచిత బియ్యం అలాట్మెంట్ జరగదని, కావున రేషన్ కార్డుదారులందరూ ఈనెల 24వ తేదీ లోపు ఈకేవైసీ పూర్తి చేయాలని సూచించారు. డీలర్లు విధిగా రోజు వారి ఎండియుకు పంపిణీ చేసే నిత్యవసర వస్తువులను వారి స్టాక్ రిపోర్ట్‌లో నమోదు చేసుకోవాలని తద్వారా స్టాక్ వ్యత్యాసాలు తెలుస్తాయన్నారు. ఆథరైజేషన్ కలిగిన డీలర్లు అందరూ ఆథరైజేషన్కు దరఖాస్తు చేసుకున్న వారు ఒక సెట్ జిరాక్స్ కాపీలను తహసిల్దార్ కార్యాలయంలో అందజేయాలని డీలర్లకు సూచించారు. రేషన్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరికి ప్రతి నెల బియ్యం అందించాలన్నారు. ఎండియు వాహనాలు లేనిచోట తప్పనిసరిగా వీఆర్ఏ లాగిన్ లో డీలర్ నిత్యవసర



సరుకులు పంపిణీ చేయాలని తెలిపారు. డీలర్లు అందరూ కార్డుదారులకు ఈకేవైసీ పూర్తి చేసేందుకు కృషి చేయాలని రెవెన్యూ ఇన్స్పెక్టర్ రాకేష్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో శివకుమార్, మండలంలోని అందరూ రేషన్ డీలర్లు పాల్గొన్నారు.



## శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థానంలో సంకష్టహర చతుర్థి హోమం

**శ్రీకాళహస్తి, మేజర్‌న్యూస్:** శ్రీకాళహస్తీశ్వరస్వామి దేవస్థానంలో సంకటహర చతుర్థి సందర్భంగా శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థానం ప్రాంగణంలో అంజంజి గణపతి కన్య మూల గణపతి ఆలయం వద్ద సంకటహర చతుర్థి హోమాన్ని దేవస్థానం పౌరోహితులు శాస్త్రోక్తముగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం డిప్యూటీ ఈఓ ఎన్ఆర్ కృష్ణారెడ్డి దంపతులు, టెంపుల్ సూపరింటెంట్ అండ్ సీఎస్ఓ నాగభూషణం యాదవ్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ హరియాదవ్, దేవస్థానం అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



## ఇరిగేషన్ స్థలం ఆక్రమణపై ఫిర్యాదు

**చిట్టమూరు, మేజర్‌న్యూస్:**

చిట్టమూరు మండలం బండాగుంట రోడ్డు సమీపంలో ఇరిగేషన్ స్థలం ఆక్రమణపై ఆ శాఖ అధికారులకు ఫిర్యాదు చేసినట్లు కొందరు తెలిపారు. ఇరిగేషన్ స్థలం ఆక్రమణపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ అధికారులకు ఫిర్యాదు చేశామన్నారు. ఆక్రమిత స్థలంలో నిర్మాణాలను వెంటనే తొలగించాలన్నారు.



## ఉచిత బీఎండీ శిబిరాన్ని సద్విని చేసుకోండి

**తిరుపతి రెవెన్యూ, మేజర్‌న్యూస్:** స్థానిక రెడ్డి రెడ్డి కాలనీలోని సాయి సుధా మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ నందు బుధవారం ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం రెండు గంటల వరకు ఉచిత బి.ఎం.డి. ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించడం జరుగుతుందని నిర్వహించడం జరుగుతుందని సాయిసుధా మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ బద్దెల సుకుమార్ మంగళవారం తెలియజేశారు. ఇంటాస్ ఫార్మా కంపెనీ (ముంబై) వారి ఆధ్వర్యంలో ఉచిత ఎముకల సాంద్రత పరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ శిబిరంలో ఉచిత సలహాలు సూచనలు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని నగర ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



రె.క.నెం. 10/2025 **గ్రామ పంచాయితీ కార్యాలయము, తిరునాచూరు.** తేది:11.03.2025

**తిరుపతి జిల్లా: తిరుపతి రూరల్ మండలం: తిరుచానూరు గ్రామ పంచాయితి**

**-: ప్రైవేటు బస్టాండు మరియు అంగడి గదుల బహిరంగ వేలపు నోటిఫికేషన్ :-**

2025వ సంవత్సరము ఏప్రిల్ నెల 01వ తేది మొదలు 2026వ సంవత్సరము మార్చి నెల 31వ తేది వరకు కూడిన ఒక సంవత్సరమునకు తిరుచానూరు గ్రామ పంచాయితికి చెందిన టూరిస్టు బస్టాండు, (APSRTC బస్సులు ప్రభుత్వ వాహనములు మరియు ఆంధ్రప్రదేశ్ టూరిజం కార్పొరేషన్ వాహనములు మినహాయించి), నందు రుసుము వసూలు చేయు గుత్త హక్కును మరియు వాణిజ్య సముదాయపు అంగడి గదులను నెలవారి బాడుగ పద్ధతిపై ఇచ్చుటకు 2025–2026వ సంవత్సరమునకు 19–03–2025వ తేది బుధవారము ఉదయం 10–00 గం॥ల నుండి మధ్యాహ్నం 2–00గం॥ల వరకు తిరుచానూరు గ్రామ పంచాయితీ కార్యాలయము నందు గ్రామ పంచాయితీ కార్యదర్శి వారిచే గాని, లేదా వారి అనుమతి పొందిన వారిచే గాని సీల్డు టెండర్లు స్వీకరించబడును. అనంతరము సాయంత్రం 3.00 గం॥ల నుండి బహిరంగ వేలము వేయబడును. బహిరంగ వేలము తదుపరి సీల్డు టెండర్లను టెండరు దారుల సమక్షమున తెరువబడును. వేలము నందు మరియు సీల్డు టెండరు నందు హెచ్చుపాట ఏదైతే దానినే పరిగణనలోనికి తీసుకొనబడును. సదరు బహిరంగవేలమును నిలుపుదల చేయుటకు సాక్షికంగా రద్దుపరచుటకు పంచాయితీ కార్యదర్శి వారికి అధికారము కలదు.

| క్రమ సంఖ్య | గుత్త వివరములు | చెల్లించవలసిన ధరావత్తు | సబ్–రిజిస్ట్రారు / తహసీల్దారు కార్యాలయము నుండి అవసరమగు సాల్వెన్సీ | సాల్వెన్సీ లేనివారు చెల్లించవలసిన ధరావత్తు |
|---|---|---|---|---|
| 1. | ప్రైవేటు టూరిస్టు బస్టాండు (APSRTC ప్రభుత్వ వాహనములు మరియు ఆంధ్రప్రదేశ్ టూరిజం కార్పొరేషన్ వాహనములు మినహా) | 25,00,000/- | 25,00,000/- | 40,00,000/- |
| 2. | 20 అంగడి గదులను (గది నెం.11 తప్ప) నెలవారి బాడుగ పద్ధతిపై బహిరంగ వేలము ద్వారా కేటాయించుటకు (8వ నెంబరు గల గదిని నాయీబ్రాహ్మణులకు మాత్రమే కేటాయించడ మైనది) | 20,000/- | - | - |
| | అంగడి గది నెం.11నకు (మెట్ల క్రింద గది) | 10,000/- | - | - |

**చెల్లించవలసిన ధరావత్తు వివరములు**

షరా: 1) వేలములో పాల్గొనదలచిన వారు గ్రామ పంచాయితీకి ఎటువంటి బకాయిలు వుండరాదు. ధరావత్తు మొత్తము చెల్లించుటకు జాతీయ బ్యాంకుల నుండి తీసిన డి.డి.లు/బ్యాంకర్స్ చెక్కులు మాత్రమే స్వీకరించబడును. డి.డి.లు/బ్యాంకర్స్ చెక్కులు పంచాయితీ సెక్రటరీ, గ్రామ పంచాయితి, తిరుచానూరు పేరున తీసి వేలమునకు ముందుగా అందజేయవలెను. హెచ్చు పాటదారుని పాటను గ్రామ పంచాయితివారు ఖాయపరచిన పిదపనే మిగిలిన డిపాజిట్టుదారులకు నిబంధనల మేరకు వారి డి.డి. లను వారికి వాపసు చేయబడును. బహిరంగ వేలము పూర్తి అయిన వెంటనే ఒకటవ, రెండవ హెచు పాటదారుల వేలము డిపాజిట్టు మినహా మిగిలినవారికి వారు చెల్లించిన డిపాజిట్టు డి.డి.లు/బ్యాంకర్స్ చెక్కులు వాపసు ఇవ్వబడును.

2) నిర్ణీత డిపాజిట్లు చెల్లించిన వారిని మాత్రమే బహిరంగ వేలమునకు అనుమతించబడును. ఇతరులు బహిరంగ వేలము నందు పాల్గొనుటకు అనుమతించబడదు మరియు డిపాజిట్టు చెల్లించువారు జి.యస్.టి. నెంబరును కలిగి వుండవలెను మరియు పాస్‌పోర్టు సైజ్ ఫోటో ఒకటిని, మరియు నివాసపు నిర్ధారణ కార్డులు అనగా ఆధార్ / ఓటరు కార్డు / డ్రైవింగ్ లైసెన్సు / పాన్‌కార్డు/ పాస్ పోర్టు / రేషన్ కార్డు ఏదేని ఒకటిని అర్జీకి జతపరచి ఇవ్వవలెను.

3) సాల్వెన్సీ అనగా సబ్ రిజిస్ట్రార్/తహసీల్దార్ కార్యాలయము నుండి పొందిన సాల్వెన్సీ మాత్రమే స్వీకరించబడును. మరియు బ్యాంకు గ్యారంటీ అనగా (సాల్వెన్సీ సర్టిఫికేట్ నందు పొందుపరచబడిన గ్యారెంటీ మొత్తము పాటదారుడు చెల్లించని యెడల బ్యాంకువారు పూచికత్తుగా వుండు విధముగా)

4) వేలపుదారుడు వేలము ఖాయపరిచిన "7" రోజుల లోపల వేలపు మొత్తము మరియు ప్రస్తుతం పరిగణలో ఉన్న రేట్ల మేరకు స్టాంపు డ్యూటీని చెల్లించవలెయును, మరియు నిబంధనల మేరకు Income Tax మరియు GST చెల్లించవలెను.

**షెడ్యూలు – 1 (ప్రైవేటు బస్టాండు)**

**రుసుములు వసూలు చేయవలసిన వివరములు**

| వ.నెం. | టూరిస్టు బస్టాండు నందు వసూలు చేయవలసిన వాటి వివరములు | వసూలు చేయవలసిన రుసుము |
|---|---|---|
| 1. | తిరుపతి–తిరుచానూరు తిరుగు ప్రైవేటు బస్సులకు 1కి రోజుకి 1 కి | 100-00 |
| 2. | టూరిస్టు బస్సులకు, మెటడోరు వ్యాను రోజు 1కి | 100-00 |
| 3. | శ్రీ శ్రీనివాసా మాక్సీ క్యాబ్ వ్యాన్ ఓనర్స్ వెల్‌ఫేర్ అసోసియేషన్ లైసెన్సు పొందిన వారి వద్ద నుండి మాత్రం మెటడోరు వ్యాను రోజు 1కి | 70-00 |
| 4. | క్వాలీస్, సుమో, ట్రాక్స్, కారు, మొదలగు వాహనములకు 1 రోజు 1 కి | 60-00 |
| 5. | జీపు, ట్రాక్టరు మొదలగు వాహనములకు 1 రోజు 1 కి | 50-00 |
| 6. | ఆటో వాహనములకు 1 రోజు 1 కి | 5-00 |

గమనిక:– బస్టాండు ప్రస్తుతము ఉన్న రీతిలోనే ఫీజులు వసూలు చేసుకొనవలెను. అదనముగా బస్టాండునకు ఎటువంటి సదుపాయములు కల్పించబడవు.

ముఖ్య గమనిక:– వేలపు నిబంధనలు వరుస నెం.1 నుండి 35 వరకు కార్యాలయపు పనివేళల యందు వచ్చి తెలుసుకొనవచ్చును.

**కె. రామచంద్రా రెడ్డి,** సర్పంచ్
తిరుచానూరు గ్రామ పంచాయితి.

**ఆర్.మాధురి** విస్తరణాధికారి (సం.రా & గ్రా.అ)
తిరుపతి గ్రామీణ మండలము & పంచాయితి కార్యదర్శి, (పూ.అ.భా)
తిరుచానూరు గ్రామ పంచాయితి

# ఫ్యాన్సీ స్టోర్‌లోకి దూరిన దుప్పి

## - అటవీ శాఖ అధికారులకు అప్పగింత



**సూళ్లూరుపేటరూరల్, మేజర్‌న్యూస్:** సూళ్లూరుపేట పట్టణంలోకి చుక్కల దుప్పిలు వచ్చేస్తు న్నాయి. ఇందులో భాగంగా మంగళ వారం మరో చుక్కల దుప్పి స్థానిక శ్రీ హరి కోట రోడ్డు పక్కన ఉన్న ప్యాన్స్ స్టోర్ లోకి వచ్చే సింది. చుక్కలు దుప్పిని గమనించన ఇరుగు పొరుగువారు ఆ దుప్పిని సంర క్షించి సమీపంలో ఉన్న అటవీ శాఖవారికి సమాచారం ఇవ్వడంతో వన్యప్రా ణి సంరక్షణ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని చుక్కల దుప్పిని వ్యాన్‌లో ఎక్కుంచు కొని అటవీ ప్రాంతంలో వదిలి పెట్టడం జరిగింది. ఈ దుప్పిలు ఎండా కాలం వస్తే పట్టణ ప్రాంతంలో కి వచ్చేస్తున్నాయి. దీనికి కారణం త్రాగు నీటి కొరత ఏర్పడంతో జనావాసాలలోకి వచ్చేస్తున్నాయి ఇక నైనా అటవి శాఖ అధికారులు వాటికి అటవి ప్రాంతంలో నీటి గుంటలు ఏర్పాటు చేసి వాటికి తాగు నీరు అందుబాటులో ఉండే విధంగా అటవీ శాఖా అధికారులు చర్యలు చేపట్టాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

# జిల్లాలో మైక్రో ఇరిగేషన్ పురోగతి, అమలులో కేంద్ర ప్రభుత్వం ఏమి చర్యలు తీసుకుంది

## - పార్లమెంటులో తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి ప్రశ్న



**తిరుపతి రెవెన్యూ, మేజర్‌న్యూస్:** ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పడిన వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతుల పంట భద్రతపై ముందు చూపుతో మైక్రో ఇరిగేషన్ అమలు, తిరుపతి జిల్లాలో సాధించిన పురోగతి, లబ్ధిదారులు వివరాలు, సూక్ష్మ నీటిపారుదల సాంకేతికత ప్రోత్సాహం గూర్చి ఎంపీ డా. మద్దిల గురు మూర్తి మంగళవారం పార్లమెంటులో ప్రశ్నించారు. ఈ ప్రశ్నకు కేంద్ర వ్యవసాయ శాఖ సహాయ మంత్రి రామ నాథ్ ఠాకూర్ సమాధానం ఇచ్చారు. పర్ డ్రాప్ మోర్ క్రాప్ పథకం 2015-16 నుంచి దేశవ్యాప్తంగా అమలులో ఉందని తెలిపారు. ఈ పథకం ద్వారా ఇప్పటి వరకు 96.97 లక్షల హెక్టార్ల విస్తీర్ణంలో మైక్రో-ఇరిగేషన్ చేపట్టారని తెలిపారు. తిరుపతి జిల్లాలో 20,819 హెక్టార్లు మైక్రో-ఇరిగేషన్ కింద కవర్ చేయబడిందని తెలియజేశారు. లబ్ధిదారులు, వారికి అందిస్తున్న ఆర్థిక సహాయం వివరాల గూర్చి వెల్లడిస్తూ సన్న, చిన్నకారు రైతులకు 55% సబ్సిడీ, ఇతర రైతులకు 45% సబ్సిడీ అందిస్తున్నామని పేర్కొన్నారు. 2015-16 నుండి ఇప్పటి వరకు తిరుపతి జిల్లాలో 19,272 మంది రైతులు ఈ పథకం ద్వారా లబ్ధిపొందారని తెలియజేశారు. ఏపీ రాష్ట్ర అధికారిక లెక్కల ప్రకారం తక్కువ నీటి వినియోగంతో పండే పం టల ప్రోత్సాహంలో బాగంగా 2022-23 నుండి 2024-25 వరకు 14, 332 హెక్టార్ల విస్తీర్ణంలో బోర్‌వెల్ ఆధారిత వరి, పొగాకు పొలాలను పప్పుధాన్యాలు, చిరుధాన్యాలు, నూనె గింజల పంటలు పండించేలా పంట మార్పు చేశారని తెలిపారు. ఇందులో బాగంగా రూ. 1.38 కోట్ల ఆర్థిక సహాయం అందించారని అన్నారు. చిరు ధాన్యాలు, పప్పుధాన్యాల పంటలను ప్రోత్సహించడం, ఉత్తమ వ్యవసాయ పద్ధతులపై అవగాహనా కార్యక్రమాలు, నాణ్యమైన విత్తనాల పంపిణీ చేయడం, చిరు ధాన్యాల ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు, పంట కోత తర్వాత నిర్వహించాల్సిన కార్యక్రమాలపై శిక్షణ, వర్క్‌షాపులు నిర్వహించడం లాంటి కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. స్థానిక పరిస్థితులకు అనుగుణంగా ఖర్చు తక్కువ, అధునాతన నీటి నిర్వహణ పద్ధతులు, వర్షపు నీటి సంగ్రహణ, రీసైక్లింగ్, వర్షపు నీరు, ఉపరితల, భూగర్భ జలాలను సమన్వయంగా వినియోగించే విధానాల రూపకల్పన, స్మార్ట్, ప్రెసిషన్ టెక్నాలజీల ద్వారా సమర్థవంతమైన సాగు విధానాలు, సరైన నీటి పారుదల విధానాలు, భూసంరక్షణ పద్ధతులు అవలంబిస్తున్నామని తెలిపారు.

# ఓటరు జాబితాను పారదర్శకంగా నిర్వహించండి : డిఆర్ఓ



**చిత్తూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్:** పారదర్శకమైన ఓటరు జాబితా తయారీకి అధికార యంత్రాంగం చర్యలు చేపడుతున్నదని జిల్లా రెవెన్యూ అధికారి కె. మోహన్ కుమార్ పేర్కొన్నారు. మంగళవారం జిల్లా సచివాలయం లోని డి ఆర్ ఓ సమావేశ మందిరంలో జిల్లాలోని గుర్తింపు పొందిన రాజకీయ పార్టీ ల ప్రతినిధులతో డి ఆర్ ఓ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డిఆర్ఓ మాట్లాడుతూ పారదర్శక ఓటర్ల జాబితా తయారీకి ఈఆర్ఓలు, ఏఆర్ఓ లు, బిఎల్ఓలు చర్యలు చేపడుతున్నారని, ఈ ప్రక్రియలో రాజకీయ పార్టీల సలహాలు, సూచనలను పరిగణలోకి తీసుకుంటామన్నారు. ఎపిక్ కార్డుల ను ఆధార్ అనుసంధానం చేసే ప్రక్రియ వేగవంతంగా నిర్వహించడం జరుగుతుందన్నారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి నియమ నిబంధనలు, చట్టాలలో అవసరమైన మార్పు చేర్పులు చేపట్టడానికి రాజకీయ పార్టీల నుండి సూచనలు స్వీకరించడం జరుగుతుందన్నారు. ఓటరు నమోదు ప్రక్రియ నిరంతరం కొనసాగుతున్నదని, మరణించిన వారి ఓటును కుటుంబ సభ్యులకు నోటీస్ అందించి తొలగిస్తున్నామన్నారు. ఒక ఓటరు రెండు నియోజకవర్గాలలో ఓటు హక్కు కలిగి ఉన్నట్లు గుర్తించినట్లైతే బి ఎల్ ఓ ల ద్వారా తగిన చర్యలు తీసుకుంటామన్నారు. పోలింగ్ స్టేషన్ ల రేషనలైజేషన్ చర్యలు చేపడుతున్నామన్నారు. జిల్లాలో ఫారం 6, 7, 8 కింద 8,268 దరఖాస్తులు అందగా 4,933 దరఖాస్తులు పరిష్కరించామని, మిగిలినవి త్వరలో పరిష్కరిస్తామన్నారు. ఈ సమావేశానికి చిత్తూరు పలమనేరు నగరి కుప్పం ఆర్డీవోలు శ్రీనివాసులు భవాని, భవాని శంకరి, శ్రీనివాసులు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులైనటి డి పి ప్రతినిధి వి.సురేంద్ర కుమార్,బి జె పి ప్రతినిధి అట్లూరి శ్రీనివాసులు,వై ఎస్ ఆర్ సి పి ఎన్.ఉదయ్ కుమార్,జనసేన పార్టీ ప్రతినిధి దేవినేని యశ్వంత్, ఆమ్ ఆద్మీ పార్టీ ప్రతినిధి బాల సుబ్రహ్మణ్యం,బహుజన సమాజ్ పార్టీ ప్రతినిధి బి లోకనాథం,సి పి ఐ ప్రతినిధి వి గంగరాజు, ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి ఏ పరదేశి మరియు ఎలక్షన్ సెక్షన్ సూపరింటెండెంట్ వాసుదేవన్ సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# టీటీడీకి రూ.1.23 కోట్ల విరాళం



**తిరుమల, మేజర్ న్యూస్:** టిటిడికి చెందిన ఎస్వీ అన్నదానం, ఎస్వీ ప్రాణదానం, ఎస్వీ విద్యాదానం విభాగాలకు మంగళవారం రూ. 1.23 కోట్లు విరాళం అందింది. కర్నాటక రాష్ట్రం బళ్ళారికి చెందిన శ్రీనివాస కన్‌స్ట్రక్షన్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ప్రతినిధులు ఈ మేరకు డిడిలను తిరుమలలోని క్యాంపు కార్యాలయంలో టిటిడి అదనపు ఈవో సిహెచ్ వెంకయ్య చౌదరికి అందజేశారు. విరాళం వివరాలు ఇలా ఉన్నాయి. రూ. 1,01,11,111 విరాళాన్ని ఎస్వీ అన్నప్రసాదం ట్రస్ట్ కు, రూ.11,11,111 విరాళాన్ని ఎస్వీ ప్రాణదానం ట్రస్ట్ కు, రూ. 11,11,111 విరాళాన్ని ఎస్వీ విద్యాదానం ట్రస్ట్ కు సదరు సంస్థ ప్రతినిధులు డిడిలను అందజేశారు. ఈ సందర్భంగా దాతలను టిటిడి అదనపు ఈవో సిహెచ్ వెంకయ్య చౌదరి అభినందించి సత్కరించారు.

**ఎస్వీ అన్న ప్రసాదం ట్రస్టుకు రూ.10 లక్షల విరాళం :** తిరుపతికి చెందిన కేఎస్వీ టాకీస్ చైర్మన్ కేతన్ శివ ప్రీతమ్ టీటీడీ ఎస్వీ అన్న ప్రసాదం ట్రస్టుకు మంగళవారం రూ.10 లక్షలు విరాళంగా అందించారు.ఈ మేరకు విరాళం డీడీని టీటీడీ అదనపు ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరికి తిరుమలలోని ఆయన క్యాంపు కార్యాల యంలో అందజేశారు. ఈ సందర్భంగా దాతను అదనపు ఈవో అభినందించారు.ఈ కార్యక్రమంలో టీటీడీ బోర్డు సభ్యులు భాను ప్రకాష్ రెడ్డి పాల్గొన్నారు.



# భారతీయులందరూ గీతా జ్ఞానాన్ని అందిపుచ్చుకుని ఆచరించాలి

## -జాతీయ గీతా ప్రచార సమితి అధ్యక్షుడు రాజబోయిన వెంకటేశ్వర్లు

**తిరుపతి ప్రెస్‌క్లబ్, మేజర్‌న్యూస్:** భారతజాతి పునర్వైభవ స్థితికి రావాలంటే భారతీయులందరూ గీతా జ్ఞానాన్ని అందిపుచ్చుకొని ఆచరించాలనే ఏకైక లక్ష్యంతో ఆవిర్భవించిన సంస్థ జాతీయ గీతా ప్రచార సమితి (ఆంధ్రప్రదేశ్) అని సమితి అధ్యక్షుడు రాజబోయిన వెంకటేశ్వర్లు స్పష్టం చేశారు. మంగళవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గీతా జ్ఞానాన్ని ప్రత్యేకించి విద్యార్థులకు అందించాలనే లక్ష్యంతో విద్యార్థులకు గీతను నేర్పిస్తూ, గీతపై రాత పోటీ పరీక్షలను కూడా నిర్వహించి ఆకర్షణీయమైన బహుమతులను అందజేయడం ప్రతి ఏడాది జరుగుతోందన్నారు. ఈ క్రమంలో ఈ ఏడాది కూడా 2024-25 సంవత్సరానికిగాను గీత రాత పోటీ పరీక్ష నిర్వహించి, అందులో విజేతలైన విద్యార్థిని విద్యార్థులకు బహుమతి ప్రధానం చేస్తారు. నేడు(బుధవారం) సాయంత్రం మూడు గంటల నుంచి స్థానిక శ్రీ వెంకటేశ్వర ఆర్ట్స్ కళాశాల నందు విద్యార్థిని విద్యార్థులకు నగదు బహుమతితో పాటు,ప్రశంసా పత్రాలను అందజేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డాక్టర్ మేడసాని మోహన్ హాజరవుతారని తెలిపారు. సమావేశంలో జాతీయ గీతా ప్రచార సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు ఎం.సుధాకర్ చౌదరి, సహాయ కార్యదర్శి సుబ్బారెడ్డి,తిరుపతి నగర కన్వీనర్ రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.



# వెదురు పెంపకాన్ని ప్రోత్సహించాలి

## - డిఆర్‌డిఏ పిడి శ్రీదేవి

**చిత్తూరుబ్యూరో, మేజర్‌న్యూస్:** వెదురు పెంపకాన్ని ప్రోత్సహించా ల్సిన అవసరం ఎంతైనా ఉందని, ఈ పంట ద్వారా అనేక లాభాలు సమ కూరే అవకాశాలు ఉన్నాయని చిత్తూరు డిఆర్డిఏ పిడి శ్రీదేవి తెలిపారు. సోమవారం చిత్తూరులోని టిటిడిసిలో వెదురు పెంపకంపై చిత్తూరు ప్రకాశం తిరుపతి, అన్నమయ్య, నంద్యాల జిల్లాలకు సంబంధించి ఎంపిక చేసిన ఏపీఎంలు, సిసిలతో రెండు రోజులు పాటు జరిగే వర్క్ షాప్ ప్రారంభించారు. ఈ సందర్భంగా పిడి మాట్లాడుతూ నేడు సాంకేతిక పరిజ్ఞానం పెరిగిన భారతీయ సంస్కృతి సంప్రదాయాల పరంగా వెదురుకు మంచి డిమాండ్ ఉందన్నారు. అతి తక్కువ ఖర్చు తోఎలాంటి భూముల్లోనైనా ఈ పంటను సాగు చేయవచ్చన్నారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభం వెదురు పెంపకం ద్వారా వస్తుందని, సంఘాల్లోని మహిళా రైతులకు దీనిపై అవగాహన కల్పించి వెదురు పెంపకంపై మక్కువ చూపే విధంగా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రస్తుతం ఈ వెదురు కనుమరుగవుతున్న నేపథ్యంలో భవిష్యత్తులో దీనికి డిమాండ్ మరింత పెరిగే అవకాశం ఉందని, పోడు భూముల సైతం ఈ పంట సాగుతుందని తద్వారా ప్రతి సంవత్సరం లక్ష రూపాయలు తగ్గకుండా ఆదాయం వచ్చే అవకాశం ఉన్నాయన్నారు. వర్షాభావ పరిస్థితులను సైతం తట్టుకొని వెదురు పెరుగుతుందన్నారు. ఈ సాగుపై క్షేత్రస్థాయిలో స్వయం సహాయ సంఘాలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఇందుకు ఇండస్ట్రీ ఫౌండేషన్ వారు పూర్తి సాంకేతిక పరిజ్ఞానాన్ని అందజేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సెర్ఫ్ జేఈ వెంకటరావు, ఇండస్ట్రీ ఫౌండేషన్ శాస్త్రవేత్త లు అశోక్, కుసుమ, అమృత, శ్రీకాంత్, చిత్తూర్ డిఆర్డి డిపిఎంలు పలువురు ఏపీఎంలు పాల్గొన్నారు.





## వడ దెబ్బ అవగాహనపై బ్యానర్, పోస్టర్ ఆవిష్కరణ

**– జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బాలకృష్ణ నాయక్**

**తిరుపతిబ్యూరో, మేజర్‌న్యూస్:** ప్రజలందరూ వడదెబ్బ తగలకుండా తగిన జాగ్ర త్తలు తీసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బాలకృష్ణ నాయక్ తెలిపారు. బుధవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి ఛాంబర్ నందు వడదెబ్బ అవగాహన గురించిన బ్యానర్స్, పోస్టర్స్‌ను జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బాలకృష్ణ నాయక్ ఆవిష్కరించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి మాట్లాడుతూ వేసవి దృష్ట్యా అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉన్నందున ప్రజలు వడదెబ్బ తగలకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ఎండ వేళ ఇంటి పట్టునే ఉండాలని బయటికి వెళ్ళాల్సి వస్తే గొడుగు, టోపి, తలపాగా వంటివి తలకు రక్షణ గా ధరించాలన్నారు. ద్రవ పదార్థాలు, పళ్ళరసాలు, ఉప్పు కలిపిన మజ్జిగ, ఓఆర్ఎస్ ద్రావణం వంటివి అధికంగా తీసుకోవాలని తెలిపారు. నీరసం, కళ్ళు తిరగడం, తల నొప్పి, వాంతులు వంటి వడ దెబ్బ లక్షణాలు ఉంటే అటువంటి వంటి వారిని చల్లటి ప్రదేశం లో ఉంచి వారిని వీలైనంత తొందరగా దగ్గర లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించాలని తెలిపారు. ముఖ్యం గా చిన్న పిల్లలు, వృద్ధులు, గర్భిణులు, దీర్ఘ రోగాలతో బాధపడేవారు( హై రిస్కు) వడ దెబ్బ కు గురికాకుండా అప్రమత్తం గా ఉండాలని హెచ్చరించారు. ఈ కార్యక్రమం లో జిల్లా ఇమ్యునైజేషన్ ఆఫీసర్ డాక్టర్ శాంత కుమారి, డిప్యూటి డిఎమ్ హెచ్ఓ డాక్టర్ మురళీ కృష్ణ, జిల్లా మలేరియా అధికారి డాక్టర్ రూప్ కుమార్, జిల్లా అంధత్వ నివారణ అధికారి డాక్టర్ మధు బాబు, ఎపిడెమి లాజిస్ట్ డా.లావణ్య, డిప్యూటి డెమో కిరణ్‌కుమార్ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## మాతా శిశు మరణాలు నియంత్రించాలి : జిల్లా వైద్యాధికారిణి

**చిత్తూరు అర్బన్, మేజర్‌న్యూస్:** జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి డాక్టర్ సుధారాణి ఆధ్వర్యంలో మంగళవారం జిల్లాలోని ఆశా నోడల్ అధికారులతో జిల్లా వైద్యారోగ్య శాఖ కార్యాలయం లోని సమావేశ మందిరంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణీ స్త్రీ మొదలుకొని మనం ఇచ్చే ప్రతి సేవ కచ్చితంగా ఉండాలని , 1000 రోజులపాటు వారిపై నిఘా ఉంచి ప్రతి సేవ ఎప్పటికప్పుడు అందించాలని, తద్వారా మాత శిశు మరణాలు లేని సమాజ స్థాపనకు కృషి చేసిన వారు అవుతాం అన్నారు. సమాజంలో ఆరోగ్యానికి మొదటి సూచిక మాత శిశు మరణాలు లేని సమాజం మాత్రమేనని, కావున ఆ దిశగా మనమిచ్చే ప్రతి సర్వీసు ఆషా లు, ఏఎన్ఎంలు ,ఎం.ఎల్ హెచ్ పి ల ద్వారా సేవలను మానిటర్ చేస్తూ ఎప్పటికప్పుడు అందించినట్లయితే ఆరోగ్య సమాజం తథ్యం. ఆ దిశగా పయనిద్దాం మని తెలిపారు. అలాగే వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని వంద శాతం అందించేటట్లు ప్రతి ఒక్కరూ బాధ్యతతో నిర్వహించాలన్నారు. అలాగే క్యాన్సర్ స్క్రీనింగ్ నందు కొత్త క్యాన్సర్ కేసులను కనుగొనడానికి ప్రతి ఇల్లులో ప్రతి ఒక్కరిని కచ్చితంగా చెక్ చేసి యాప్ నందు నమోదు చేసి అవగాహన కల్పించాలి. అలాగే సంక్రమణ, అసంక్రమణ వ్యాధులపై నిఘా ఉంచి ప్రతి గ్రామం నందు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. అలాగే ఆశాలు ప్రతిరోజు తప్పకుండా యాప్ ను లాగిన్ చేయాలి.




అర్హులైన దంపతుల అప్డేషన్ కొత్తగా నమోదయ్యే ప్రెగ్నెన్సీస్ నమోదు, కాన్పు అయిన తర్వాత హెచ్బిఎన్సి సేవలు, హెచ్ బి వై సి సేవలు, ఐరన్ సిరప్ పంపిణీ తప్పక అప్డేట్ చేయాలి. పిహెచ్సి పరిధిలో చేసే ప్రతి ఆరోగ్యకర కార్యక్రమాన్ని నోడల్ అధికారులు మానిటర్ చేసినట్లయితే మంచి ఫలితాలు అందించ వచ్చున్నారు. అన్ని రకాల యాప్స్ నందు ఏ రోజుకు ఆ రోజు పూర్తి అయ్యేటట్లు చూడాలన్నారు. ఇలా అన్ని రకాల జాతీయ ఆరోగ్య కార్యక్రమాలన్ని పర్యవేక్షించి మన జిల్లాను ముందు ఉంచాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏ డి యం హెచ్ ఓ డాక్టర్ వెంకటప్రసాద్, డి ఐ ఓ డాక్టర్ హనుమంతరావు, డాక్టర్ అనూష, డాక్టర్ ప్రవీణ , రామ్మోహన్, మూర్తి ఆశ నోడల్ అధికారులు పాల్గొన్నారు.

## కార్వేటినగరంలో ఆగని అక్రమాలు గుట్టల తవ్వకాలు!

**చిత్తూరుబ్యూరో మేజర్‌న్యూస్:** ప్రభుత్వం మారిన కొందరు ప్రజాప్రతినిధులు అధికారులు అండదండలతో మట్టి మాఫియా చెలరేగిపోతుంది, రాత్రి పగలు తేడా లేకుండా మట్టి ఆక్రమాలు రవాణా యథేచ్ఛగా సాగుతుంది. ప్రభుత్వ భూములు అడవి భూములు చెరువులు గుంటలు కాలువల్లో ఇస్తారాజ్యంగా యంత్రాలతో మట్టితవి టిప్పర్లు ట్రాక్టర్లతో తరలిస్తున్నారు. కార్వేటినగరం మేజర్ పంచాయతీ విజయ మాంబాపురం, కార్వేటినగరం నిశంక దుర్గం, ఎల్ ఆర్ పేట, తదితర పంచాయతీ నుంచి తమిళనాడుకు మట్టి తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. రియల్ ఎస్టేట్ సంబంధించి స్థలాలు చదును చేసి అవసరమైన మేరకు మట్టిని తరలించి లక్షలాది రూపాయలు దండుకుంటున్నారు. మట్టి మాఫియా కొండలు తవ్వుతుంటే ఆ ప్రాంతాలను దర్జాగా ఆక్రమించి చేసుకొని పంటలు సాగు చేసుకోవడం గమనార్హం. మేజర్ పంచాయతీలో రెండు కిలోమీటర్ లోపు ఉన్న భూములను పరిరక్షించాల్సిన రెవిన్యూ అధికారులు నిమ్మకు నీరు వచ్చినట్లు వ్యవహరిస్తారు తో మట్టి మాఫియా కబ్జాదారులు కలిసి కోట్ల రూపాయలు విలువైన భూములను ఆక్రమిస్తున్నారు. పోలీస్ స్టేషన్ కూత వేటు దూరంలో ఓ వ్యక్తి మట్టిని స్థిరాస్తి పనులకు తరలిస్తున్న ఎవరు పట్టించుకోకపోవడం దారుణమని ప్రజలు బహిరంగ విమర్శిస్తున్నారు. స్థానికులు ఎవరైనా మట్టి మాఫియాను ప్రశ్నిస్తే అధికారులు అందరూ నగదు చెల్లించి అనుమతులు తీసుకుంటున్నామని చెప్తున్నాడు గమనార్హం, మండలంలో ఇంత భారీ స్థాయిలో మట్టి తవ్వకాలపై జిల్లా స్థాయి అధికారులు దృష్టి సాధించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. గతవారం క్రితంలో మండల సర్వసభ్య సమావేశంలో కూడా మట్టి ఎక్కువగా తరలిపోతుందని ఎంపీపీ లతా బాలాజీ అధికారుల దృష్టికి తీసుకురాగా, ఆ సమావేశానికి రెవెన్యూ అధికారులు హాజరు కాలేదు. తాసిల్దార్ నాగరాజు వివరణ త్వరగా మట్టి తవ్వకాలకు ఎలాంటి అనుమతులు లేవు, ఎవరైనా మట్టి తరలిస్తుంటే వెంటనే చర్యలు తీసుకుంటామని, కొండలు గుట్టలు తవ్వితే సంబంధిత యంత్రాలను సీజ్ చేస్తామన్నారు, మండలంలో ఎక్కడైనా మట్టి తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో వెళ్లి పనులు నిలిపివేస్తామని అనుమతి లేకుండా తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.




## కూటమి పాలనలో విద్యుత్ భారం నుంచి ప్రజలకు ఊరట

**మాజీ ఎమ్మెల్సీ గౌని వారి శ్రీనివాసులు**



**శాంతిపురం మేజర్‌న్యూస్ :** గడచిన 9 నెలల కూటమి ప్రభుత్వ పాలనలో విద్యుత్ చార్జీల నుండి ప్రజలకు ఊరట లభించిందని ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి, మాజీ శాసనమండలి సభ్యులు, మాజీ టీటీడీ బోర్డు మెంబర్ గౌని వారి శ్రీనివాసులు అన్నారు. మంగళవారం కుప్పంలో ఆయన మాట్లాడుతూ గతంలో వైసీపీ పాలనలో జగన్మోహనరెడ్డి ప్రజలపై విద్యుత్ వారం మోపారని ఆవేదన వ్యక్తం చేశారు. ట్రూఅప్ ఛార్జీలతో ప్రజలను ఇబ్బందులకు గురి చేశారు అన్నారు. అయితే ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడు విద్యుత్ భారం తగ్గించేందుకు చర్యలు చేపట్టారు అన్నారు. రాష్ట్ర ప్రజలకు కూటమి ప్రభుత్వం ట్రూ ఆప్ చార్జీల నుంచి ఉపశమనం కలిగించిందన్నారు. ట్రూఅప్ ఛార్జీలను తగ్గించేందుకు కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. వైసీపీ పాలనలో 9సార్లు విద్యుత్ ఛార్జీలను పెంచారని పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులపై రూ. 1,232 కోట్ల భారాన్ని వైసీపీ ప్రభుత్వం మోపిందన్నారు. నేడు ముఖ్యమంత్రి చంద్రబాబు విద్య వినియోగదారులకు ట్రూ ఆఫ్ చార్జీల నుంచి ఉపశమనం కలిగించారన్నారు. 1059.75 కోట్ల ట్రూ ఆప్ డౌన్ ను ప్రకటించడం జరిగిందన్నారు. ఎన్నికలకు ముందు చేనేతలకు కూటమి ఇచ్చిన హామీ మేరకు తొమ్మిది నెలల కాలంలోనే చేనేత కళాకారులకు 200 యూనిట్లు, పవర్ లూం ఉన్న వారికి 500 యూనిట్ ఉచిత విద్యుత్ ఇచ్చేందుకు క్యాబినెట్ ఆమోదముద్ర వేకిందన్నారు. ఆన్లైన్లో మహిళల ఉత్పత్తులు అమ్మకానికి ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. 200కు పైగా వాట్సాప్ సేవలను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడం జరిగిందన్నారు. ప్రణాళికాబద్ధంగా ఆంధ్ర రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కృషి చేస్తున్నారన్నారు.



## మత సామరస్యానికి ప్రతీక.. ఇఫ్తార్ విందు

**: యూనియన్ అధ్యక్షులు షంషీర్**

**రేణిగుంట మేజర్‌న్యూస్:** పవిత్ర రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలో ఉండే ముస్లిం సోదరుల కోసం ఏర్పాటు చేసే ఇఫ్తార్ విందు ఆత్మీయత, మత సామరస్యానికి ప్రతీక అని రేణిగుంట శ్రీ సిద్ధి వినాయక టాక్సీ యూనియన్ అధ్యక్షులు షంషీర్ అన్నారు. మంగళవారం నాడు షాదిమహల్ వద్ద శ్రీ సిద్ధి వినాయక టాక్సీ యూనియన్ అధ్యక్షులు షంషీర్ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ముస్లిం సోదరులు రంజాన్ మాసం అంతా భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తారని అన్నారు. పవిత్ర రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలు ఆచరించే ముస్లిం సోదరులు ఇచ్చే ఇఫ్తార్ విందు మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు వెంకటరమణ, సలహాదారులు రసూల్, మురళి నాయక్, మల్లికార్జున రెడ్డి పాల్గొన్నారు.

## ఎంబియులో విష్ణుమంచు 11వ ఆర్ట్ ఫౌండేషన్ ప్రారంభోత్సవం

**చంద్రగిరి, మేజర్‌న్యూస్:** ఏ.రంగంపేటపరిధిలోనిమోహన్ బాబు యూనివర్సిటీలో మంగళవారం సెంట్రల్ లైబ్రరీ లో విష్ణు మంచు ఆర్ట్ ఫౌండేషన్ 11వ వార్షికోత్సవం సందర్భంగా దేశంలో పేరున్నచిత్రకారులచే బొమ్మలు వేయించడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఎంబియుప్రో ఛాన్సలర్ మంచువిష్ణుఆధ్వర్యంలో ఈకార్యక్రమం నిర్వహించారు. ఈ కార్య క్రమానికి ముంబై, చెన్నై, బరోడా, ఢిల్లీ, కలకత్తా, గుజరాత్, బెంగుళూర్, గోవా, మరియు ఆంధ్రప్రదేశ్ నుంచి వచ్చిన చిత్రకారులు పాల్గొన్నారు. గత పది సం"లుగా దేశంలోని పేరెన్నికగన్న చిత్రకారులందరూ విష్ణు మంచు ఆర్ట్ ఫౌండేషన్ కార్యక్రమంలో పాల్గొని అద్భుతమైన చిత్రాలు గీసితమ చిత్ర కళానైపుణ్యాన్ని ప్రదర్శించారు. ఈసందర్భంగా మంచు విష్ణు మాట్లాడుతూ ఈ చిత్రాలు అమూల్యమని ఈ చిత్రకళను ప్రపంచానికి తెలియజేయడమేనా ఉద్దేశమని, భారతీయులలో అద్భుత నైపుణ్యంకలిగిన చిత్రకారులు ప్రపంచంలో ఎవరికితీసి పోరని వచ్చిన చిత్ర కారులనుఅభినందించారు ఈ కార్యక్రమంలో మోహన్ బాబు విశ్వవిద్యాలయ ఛాన్సలర్ డా.మోహన్ బాబు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వినయ్ మహేశ్వరి, ప్రొ.వోస్ట్ డా.నాగ రాజు రామరావ్, వైస్ ఛాన్సలర్ ప్రొ.కరుణాకరన్ రిజిస్ట్రార్ డా.కే. సారథి, డి ఎఫ్ఎ రవి శేఖర్‌తో పాటు వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన చిత్రకారులు ఆంధ్రప్రదేశ్ చెందిన మాధవి ఆనందరావు, ముంబాయికి చెందిన గురు చరణ్ సింగ్, రవి మందాలి, స్మిత మందాలి, సుజాత, విజయ్, హైదరాబాదుకు చెందిన ఎల్ఎన్ వి శ్రీనివాస్, సుందర్, కరుణ, హారతి, గాయత్రి, లక్ష్మీ కిరణ్, వెంకన్న, బాల బకట రాజు, అహ్మదాబాద్‌కు చెందిన మన్సూర్, ఢిల్లీకి చెందినశ్రీకర్ దాస్, వికాస్ కుమార్, నూపర్ కుండ్ గుండ్ కలకత్తాకు చెందిన సుఖాంత్ దాస్, గోవాకు చెందిన చసిన్ సాగర్, చెన్నైకి చెందిన మనోహర్, ఎస్. కుమార్‌తో పాటు డీన్లు, ప్రొఫెసర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.





## మంగళం డిపో నుండి హెూంగసంద్రకు సూపర్ లగ్జరీ సర్వీస్

**-డిపో మేనేజర్ భాస్కర్**

**తిరుపతి ప్రెస్‌క్లబ్, మేజర్‌న్యూస్:** ప్రజల సౌకర్యార్థం ఏపీఎస్ఆర్టీసీ మంగళం డిపో నుండి బెంగళూరులోని హెూంగ సంద్రకు ఈ నెల 21వ తేదీ నుండి సూపర్ లగ్జరీ సర్వీసును ప్రారంభిస్తున్నట్లు మంగళం డిపో మేనేజర్ భాస్కర్ మంగళవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. ఈ బస్సు 21వ తేదీ శుక్రవారం రాత్రి 11:45 గంటలకు తిరుపతి సెంట్రల్ బస్ స్టేషన్ నుండి బయలుదేరి..వయా టిన్ ఫ్యాక్టరీ,మార్ధనహళ్లి, సిల్క్ బోర్డు, ఎలక్ట్రానిక్ సిటీ మీదుగా హెూంగ సంద్రకు ఉదయం 5:45 గంటలకు చేరుకుంటుందని అన్నారు. అదేవిధంగా అక్కడి నుంచి ఉదయం 10:30 గంటలకు బయలుదేరి తిరుపతి సెంట్రల్ బస్ స్టేషన్ కు సాయంత్రం 4:30 గంటలకు చేరుకుంటుందని,బస్సు చార్జీ 490 రూపాయలని ఆయన వివరించారు. ఈ బస్సు సర్వీస్ ఆ రూట్ లో ప్రయాణం చేయు ప్రజలకు, ఉద్యోగులకు,సాఫ్ట్ వేర్ ఉద్యోగులకు చాలా సౌకర్యంగా ఉంటుందని తెలిపారు. కావున ఈ అవకాశాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాల్సిందిగా డిపో మేనేజర్ భాస్కర్ కోరారు.

## విజయం అధ్యాపకురాలికి డాక్టరేట్ ప్రదానం



**చిత్తూరు అర్బన్, మేజర్‌న్యూస్:** నగరంలోని స్థానిక విజయం సైన్స్ అండ్ ఆర్ట్స్ డిగ్రీ కళాశాలలో స్టాటిస్టిక్స్ విభాగంలో అధ్యాపకురాలుగా పని చేస్తున్న ఎన్.మాధవి లతకు శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీ, తిరుపతి వారు డాక్టరేట్ ప్రధానం చేశారని విజయం విద్యాసంస్థల అధినేత తేజో మూర్తి ఓ ప్రకటనలో తెలియజేశారు.

## ప్రమాదాల నివారణ, అతివేగానికి నియంత్రణ బారికేడ్లు



**నగరి, మేజర్‌న్యూస్:** ప్రమాదాల నివారణ, అతివేగాన్ని దృష్టిలో ఉంచుకుని నగరి డీఎస్పీ సయ్యద్ మహ్మద్ అబ్దుల్ అజీజ్ నేతృత్వంలో నగరి తిరుత్తణి ప్రధాన రహదారి నందు నగరి విక్రమ్ ఇన్స్పెక్టర్ బారికేడ్లను ఏర్పాటు చేశారు.

## రీ సర్వే పనులు పరిశీలన



**పెద్దపంజాణి, మేజర్‌న్యూస్:** మండలంలోని చలమంగళం గ్రామపంచాయతీలో జరుగుతున్న రీసర్వే పనులను మంగళవారం ఇన్స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ నాగేశ్వరరావు పరిశీలించారు. కాగా రాష్ట్రంలో రీ సర్వే పనులకు గాను పైలెట్ ప్రాజెక్టుగా పెద్దపంజాణి మండలం చలమంగళం గ్రామం ఎంపికైంది. ఈ క్రమంలో పెద్దపంజాణి మండలం చలమంగళంలో జరుగుతున్న రీసర్వే పనులను మంగళవారం ఇన్స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ నాగేశ్వరరావు డిప్యూటీ ఇన్స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ కృష్ణమూర్తి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పెద్దపంజాణి తహసీల్దార్ అనిల్ కుమార్, రీ సర్వే డీప్యూటీ తహసీల్దార్ రమేష్,మండల సర్వేయర్ సైరాజ్ నాయక్, మండల రెవిన్యూ ఇన్స్పెక్టర్ రాకేష్ , గ్రామ సర్వేయర్ సోమశేఖర్, గ్రామ రెవిన్యూ అధికారి రత్నప్ప, మండల సర్వే సిబ్బంది పాల్గొన్నారు.

## గడ్డురు కాలనీలో జ్వరం కేసులు పరిశీలన



**పలమనేరు, మేజర్‌న్యూస్:** పలమనేరు మున్సిపాలిటీ పరిధిలోని గడ్డురు కాలనీలో మంగళవారం ఇంటింటికి వెళ్లి ఆరోగ్య సిబ్బంది జ్వరపు కేసులు ఉన్నాయా అని విచారణ చేయడం జరిగినది. ఎండాకాలం కాబట్టి ప్రతి ఒక్కరూ 12 గంటల పైన నాలుగు గంటల లోపు బయట తిరగరాదని అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే బయటకు వెళ్లాలని అలాగే బయటకు వెళ్లినప్పుడు గొడుగులను తప్పక వాడాలని ద్రవపదార్థములను ఎక్కువగా తీసుకోవాలని ముఖ్యముగా లేబరు పనులకు వెళ్లేవారుతప్పక ఈ జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలకు ఆరోగ్య సిబ్బంది బోధించడం జరిగినది. ఇందులో భాగంగా ఇంటి చుట్టు ప్రక్కల నీటి నిల్వలు లేకుండా చూడాలని అలాగే ప్రతి శుక్రవారం ఫ్రైడే డ్రై డే పాటించాలని ప్రజలను తెలియజేశారు. జ్వరపు కేసులు ఉన్నచో తప్పనిసరిగా రక్త పరీక్షలు తీసి తీసిన రోజే యూపీఎస్సీ పాతపేట ల్యాబ్ కి పంపాలని వాటి వివరములను రిజిస్టర్లలో నమోదు చేయాలని జ్వరపు కేసులలో అప్రమత్తంగా ఉండి ప్రజలను దోమ కాటు నుండి వచ్చు మలేరియా చికెన్ గున్యా ఫైలేరియా డెంగు మొదలగు వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని వైద్య ఆరోగ్య సిబ్బందికి సూచించడం జరిగినది. ఈ కార్యక్రమములో పలమనేరు సబ్ యూనిట్ అధికారి జయశంకర్ పర్యవేక్షణలో జరిగినది. ఇందులో ఆరోగ్య సిబ్బంది సుజాత, ఆశాలు భార్గవి, పద్మమ్మ, శోభ తదితరులు పాల్గొన్నారు.

## బాలికల హై స్కూల్‌ను సందర్శించిన మండల స్పెషల్ ఆఫీసర్



**పలమనేరు, మేజర్‌న్యూస్:** మున్సిపాలిటీ నందు మంగళవారం ఉదయం మున్సిపాలిటీ స్పెషల్ ఆఫీసర్ సుధాకర్ బాలికల పాఠశాలను సందర్శించారు. గర్ల్స్ హైస్కూల్ నందు తాగునీరు, మురుగు దొడ్లు పరిశీలించి తగు సూచనలు అందించారు. అనంతరం అంగన్వాడీ కేంద్రాలను సందర్శించి ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించారు. ఎద్దుల సంతవీధిలో ఉన్న హెల్త్‌సెంటర్‌ను సందర్శించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ మండల స్పెషల్ ఆఫీసర్ సుధాకర్, మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి, మున్సిపల్ మేనేజర్ ఖాదర్ మోహిద్దీన్, ఎంఈఓ 2 బాలసుందరం, ఐసిడిఎస్ సూపర్వైజర్ నజీమా, పురపాలక సిబ్బంది,ఐసిడిఎస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## పేదరికం లేని పట్టణంగా శ్రీకాళహస్తి అభివృద్ధి

**- తెలుగుదేశం నేత జి విజయ్ కుమార్**



**శ్రీకాళహస్తి, మేజర్‌న్యూస్:** పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ముఖ్యమంత్రి నారా చంద్ర బాబునాయుడు, ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి సూచనల మేరకు ఐదు సచివాలయాలు సచివాలయ సిబ్బంది, సచివాలయ పరిధిలో ప్రజలకు ఏర్పాటు చేసిన పి4 ప్రభుత్వం ప్రైవేట్ ప్రజలు భాగస్వామ్యంతో కూడిన కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథి తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు జి విజయ్ కుమార్. మున్సిపల్ కమిషనర్ గిరి కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా విజయకుమార్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఎంతో దూర దృష్టితో విజన్ 20 20 కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని తద్వారా కొంతమంది ఆర్థికంగా అభివృద్ధి చెందారని ప్రస్తుతం 20 47 లోపు ఆంధ్ర రాష్ట్రంలో పేదవారు అంటూ ఉండకూడదని ఉద్దేశంతో ప్రతి నియోజకవర్గంలో సర్వే చేపిస్తున్నాడని తద్వారా ఈ ఏడాది దాదాపు ప్రతి మనిషి సగటున 3 లక్షలు రూపాయలతో ఉన్నారని రాబోయే సంవత్సరంలో మూడు లక్షల 50 వేల రూపాయలతో ఆర్థికంగా ఎదగాలని. 20 47 లోపు 55 లక్షల రూపాయలు తో ప్రతి ఒక్కరు ఆర్థికంగా ఎదగాలని. విద్య వైద్యం సంతోషంగా ఆంధ్ర రాష్ట్ర ప్రజలు జీవనం మార్చే విధంగా ప్రణాళికలు చేస్తున్నారని. ముఖ్యమంత్రి శాసనసభలో ప్రతి శాసనసభ్యునికి మీ మీ నియోజకవర్గాలలో పేదవారిని గుర్తించి వారిని ఆర్థికంగా బలోపేతం చేయాలని దిశా నిర్దేశం చేశారు. సీఎం ఈ కార్యక్రమాన్ని మార్చి 30వ తారీకు అనగా తెలుగు ఉగాది సందర్భంగా ప్రవేశపెడుతున్నాడని ప్రతి శాసన సభ్యున్ని వాళ్ళ నియోజకవర్గాల్లో ఈ కార్యక్రమం మొదలు పెట్టాలని ఆదేశించటం జరిగినదన్నారు. పట్టణంలో ప్రతి వార్డులో ప్రజలు దీనిపై అవగాహన పెంచుకొని ప్రతి ఒక్కరు ఆర్థికంగా ఎదగాలని ఎమ్మెల్యే బొజ్జల ఆకాంక్షని, ప్రతి ఒక్కరూ దీని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సచివాలయ పరిధిలో తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు. వార్డు సభ్యులు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## 1956 సవరణ బిల్లును అసెంబ్లీలో ప్రవేశపెట్టడం హర్షనీయం

**-ది మెడికల్ ప్రాక్టీషనర్స్ అసోసియేషన్**




**తిరుపతి ప్రెస్‌క్లబ్, మేజర్ న్యూస్:** ఆంధ్రప్రదేశ్లో ఆయుర్వేద వైద్యుల హక్కులను పరిరక్షించి, ఆయుర్వేద వైద్య విధానాన్ని మరింత అభివృద్ధి చేయడానికి కీలకమైన ఆంధ్రప్రదేశ్ ఆయుర్వేదిక్ అండ్ హెూమియోపతి మెడికల్ ప్రాక్టీషనర్స్ రిజిస్ట్రేషన్ యాక్ట్ 1956 సవరణకు సంబంధించిన బిల్లును నిన్నటి రోజు అసెంబ్లీలో, అలాగే మంగళవారం శాసనమండలిలో ప్రభుత్వం ప్రవేశపెట్టడం హర్షణీయమని "ది మెడికల్ ప్రాక్టీషనర్స్ అసోసియేషన్" రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ బి.రాజేష్ కుమార్ అన్నారు.మంగళవారం స్థానిక ప్రెస్ క్లబ్ లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఈ బిల్లు ఆమోదం ద్వారా రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న ఆంధ్రా బోర్డు ఫర్ ఆయుర్వేద స్థానంలో నేషనల్ కమిషన్ ఫర్ ఇండియన్ సిస్టం ఆఫ్ మెడిసిన్ యాక్ట్ 2020 ప్రకారం ఆంధ్రప్రదేశ్లో స్టేట్ మెడికల్ కౌన్సిల్ ఫర్ ఇండియన్ సిస్టం ఆఫ్ మెడిసిన్ ఏర్పాటు జరుగుతుందని, దీంతో పాటు ఈ స్టేట్ కౌన్సిల్ 13 మంది పాలకమండలి సభ్యులతో ఏర్పాటు అవుతుందని ఆనందం వ్యక్తం చేశారు.ద మెడికల్ ప్రాక్టీషనర్స్ అసోసియేషన్ ఆంధ్రప్రదేశ్ నిరంతర కృషి,అంకిత భావం, పట్టుదలతో ప్రభుత్వంతో చర్చలు,అధికారులతో సంప్రదింపులు జరపడంతో..దాని ఫలితంగా చివరికి రాష్ట్ర అసెంబ్లీలో ఆయుర్వేద కౌన్సిల్ ఏర్పాటుకు బిల్లు ప్రవేశపెట్టడం శుభపరిణామం అన్నారు. దీనికి కారణమైన సీఎం చంద్రబాబు నాయుడు,రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్,అలాగే ఈ బిల్లును ఏకగ్రీవంగా ఆమోదించిన శాసన సభ్యులందరికీ తమ అసోసియేషన్ తరపున ధన్యవాదాలు తెలుపుతున్నామని అన్నారు.త్వరలో ఈ బిల్లు గవర్నర్ ఆమోదం, అదేవిధంగా గెజిట్ నోటిఫికేషన్ పొంది నిబంధనలు రూపొందింపు జరిగేలా ప్రభుత్వం దృష్టి పెట్టాలని కోరారు.ఈ బిల్లు ద్వారా 55 ఏళ్లుగా పాలకమండలి లేకుండా నడుస్తున్న ఆంధ్ర బోర్డ్ ఫర్ ఆయుర్వేద కు చట్టబద్ధత లభించడం ఆయుర్వేద రంగానికి ఎంతో మేలైన విషయం అన్నారు.సమావేశంలో అసోసియేషన్ చిత్తూరు జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.రవికుమార్, కోశాధికారి డాక్టర్ సుందరవదన, ఎగ్జిక్యూటివ్ మెంబర్ డాక్టర్ జోష్నా పాల్గొన్నారు.

## స్పోర్ట్స్ మీట్లో పాల్గొన్న ప్రభుత్వ విప్

**కార్వేటినగరం మేజర్‌న్యూస్:** విజయవాడ ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియం నందు ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పోర్ట్ మీట్ -2025 నందు టగ్ ఆఫ్ వార్, క్రికెట్ క్రీడల నందు పాల్గొన్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే డాక్టర్ వి యం థామస్ పాల్గొన్నారు.



## అక్షితకు హెవీ డ్రైవింగ్ లైసెన్స్ అందజేత



**తిరుపతి ప్రెస్‌క్లబ్, మేజర్‌న్యూస్:** స్థానిక పద్మావతి మహిళా ఇంజనీరింగ్ కళాశాల నందు బీటెక్ మెకానికల్ ఇంజనీరింగ్ నాల్గవ సంవత్సరం చదువుతున్న వి.అక్షిత అనే విద్యార్థిని ఏపీఎస్ఆర్టీసీ అలిపి డిపో నందు హెవీ మోటార్ డ్రైవింగ్ కళాశాలలో శిక్షణ పూర్తి చేసుకున్నారు.ఈ సందర్భంగా మంగళవారం స్థానిక జిల్లా ప్రజా రవాణా అధికారి కార్యాలయం నందు జిల్లా ప్రజా రవాణాధికారి(డిపిటిఓ) జి.నరసింహులు అక్షితకు హెవీ డ్రైవింగ్ లైసెన్స్ అందజేసి అభినందనలు తెలియజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హెవీ డ్రైవింగ్ లైసెన్స్ పొందడానికి శిక్షణ తీసుకున్న వారిలో జిల్లా మొత్తం మీద అక్షిత రెండవ మహిళని కొనియాడారు.ఈమెను ఆదర్శంగా తీసుకుని మహిళలందరూ ముందుకు వచ్చి రవాణా అలాగే ఇతర రంగాలలో రాణించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో అకౌంట్స్ ఆఫీసర్ చంద్రమణి,డ్రైవింగ్ కళాశాల శిక్షకులు సివి.గోపాల్, అక్షిత తండ్రి, అలాగే ఇతర ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

## అక్రమ కట్టడాలు కూల్చేసిన రెవెన్యూ అధికారులు



**రేణిగుంట, మేజర్ న్యూస్:** మండలంలోని కొట్టపాలెం లెక్కదాకలో ఉన్న సర్వే నెంబర్ 100/1 గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన అక్రమ కట్టడాలపై మంగళవారం రెవెన్యూ అధికారులు అక్రమ కట్టడాలు జెసిబి సాయంతో కూల్చేశారు. కూల్చి వేసిన అనంతపురం బాధితులు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో ఇతరుల నుండి కొనుగోలు చేసిన స్థలంలో కట్టడాలు చేపడుతున్నప్పుడు అప్పుడు సహకరించిన రెవెన్యూ అధికారులు మల్ల ఇప్పుడూ అదే రెవెన్యూ అధికారులు కూల్చివేయడం ఏంటని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన



**పలమనేరు, మేజర్‌న్యూస్:** పలమనేరు పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో ఏపీఎన్జీజీవో సంఘం సహకారంతో తిరుపతి అమెరికన్ లేజర్ కంటి ఆసుపత్రి వారి ద్వారా స్థానిక ఎన్జీఓ హెూమ్ నందు ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరానికి ఉద్యోగులు, రిటైర్డు ఉద్యోగుల తో పాటు ప్రజల నుండి విశేష స్పందన లభించింది. శిబిరంలో 210 మందికి కంటి పరీక్షలు నిర్వహించి 60 మందిని శస్త్ర చికిత్సలకు ఎంపిక చేసి వారిని ప్రత్యేక బస్సు ఏర్పాటు చేసి తిరుపతి ఆసుపత్రికి పంపి చికిత్స పూర్తయిన పిదప తిరిగి పలమనేరు నందు బస్సులో పూర్తి ఉచితంగా చేరుస్తారని పిపిఎస్ అధ్యక్షులు సుబ్రమణ్యం పిళ్ళై, గౌరవాధ్యక్షులు ఆనందబాబు, కార్యదర్శి నరసింహులు తెలిపారు. ఈ కార్యక్రమంలో అమెరికన్ లేజర్ ఐ హాస్పిటల్ వైద్యులు, పి.పి.ఎస్ సభ్యులు శ్రీపురం సీతారామయ్య, విజయకుమార్ రెడ్డి, రాఘవయ్య, దొరస్వామి, దేవరాజులు, పొన్ముడి, నాగప్ప, జగన్నాథం, సన్నిరాజు, సాంబయ్య, రామచంద్ర, సామరాజు, రెడ్డెప్ప నాయుడు, దవణముని, విజయకుమార్, సయ్యద్ నిసార్, నారాయణ, పెన్షనర్ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు గురురాజారావు, రత్నారెడ్డి, గౌసబాషా, గోవిందయ్య పాల్గొన్నారు.

## ఐరాల భవిత కేంద్రంలోని పిల్లలు అభివృద్ధి చెందాలి

– సమగ్ర శిక్ష సహిత విద్యా కోఆర్డినేటర్ జయప్రకాష్ నాయుడు



**ఐరాల మేజర్‌న్యూస్:** మండల విద్యాశాఖ అధికారి కార్యాలయం ఆవరణలో ఉన్న భవిత కేంద్రాన్ని చిత్తూరు సమగ్ర శిక్ష సహిత విద్యా కోఆర్డినేటర్ జయప్రకాష్ నాయుడు, ఐరాల ఎంఈఓ రుశేంద్రబాబు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా భవిత కేంద్రంలోని పిల్లలతో సంభాషించి వారి యొక్క అభివృద్ధిని పరీక్షించారు. భవిత కేంద్రంలోని పిల్లల హాజరు, సహిత విద్య ఉపాధ్యాయుల హాజరు రిజిస్టర్‌లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా భవిత కేంద్రంలో పిల్లలను నమోదు చేయించాలని సూచించారు. ప్రత్యేక అవసరాల పిల్లలను ప్రభుత్వం అన్ని రకాలుగా ఆదుకుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సహిత విద్య ఉపాధ్యాయులు సురేష్, కవిత తదితరులు పాల్గొన్నారు.

## నగరిలో పవర్ లూమ్స్, చేనేత కార్మికుల సంబరాలు



**నగరి, మేజర్‌న్యూస్:** పవర్లూమ్ కార్మికులకు 500 యూనిట్లు చేనేత కార్మికులకు 200యూనిట్లు ఉచిత విద్యుత్ ఇచ్చిన మాట నిలబెట్టుకున్నందుకు తెలుగు దేశం వ్యవస్థాపక అధ్యక్షులు నందమూరి తారక రామారావు విగ్రహానికి పూల మాల వేసి ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడుకి, ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్‌కి ధన్యవాదాలు తెలిపిన నగరి పవర్ లూమ్స్, చేనేత కార్మికులు. అనంతరం స్వీట్లు పంచుకుని సంబరాలు చేసుకున్నారు. తమ సంతోషాన్ని వ్యక్తం చేస్తూ సీఎం చంద్రబాబు పటానికి పాలాభిషేకం చేశార్వహించారు.

## నిధులు దుర్వినియోగం కేసులో పోస్టు మాస్టర్‌కు రిమాండ్



**చౌడేపల్లి రూరల్ మేజర్‌న్యూస్:** నిధులు దుర్వినియోగం కేసులో పోస్టుమాస్టర్ ను రిమాండ్కు తరలించినట్లు ఎస్సై నాగేశ్వరావు తెలిపారు ఆయన కథనం మేరకు... చౌడేపల్లి పట్టణంలోని పోస్ట్ ఆఫీస్‌లో బి భాస్కర్‌నాయక్‌ను 2019 సంవత్సరంలో సబ్బు పోస్టుమాస్టర్‌గా పనిచేశారు. ఆ సమయంలో ఖాతాదారులకు సంబంధించిన రూ లక్ష వరకు నిధులు దుర్వినియోగం చేసినట్లు 2024లో పోస్టల్ డిపార్ట్మెంట్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. ఈ మేరకు ఎఫ్ఐఆర్ నమోదయింది కేసు దర్యాప్తులో భాగం గా భాస్కర్ నాయకులు పుంగనూరు కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి రిమాండ్ విధించినట్లు ఎస్ఐ నాగేశ్వరావు వివరించారు.

## ఎమ్మెల్యే థామస్‌ను కలిసిన మోహన్‌మురళి



**వెదురుకుప్పం, మేజర్‌న్యూస్:** విజయవాడ ఇందిరాగాంధీ స్టేడియంలో జరుగుతున్న స్పోర్ట్స్ మీట్ కార్యక్రమంలో గంగాధర నెల్లూరు శాసనసభ్యులు డాక్టర్ వి ఎం థామస్ ను వెదురుకుప్పం క్లస్టర్ ఇంచార్జ్ మోహన్ మురళి, టిడిపి రాష్ట్ర సాంస్కృతిక విభాగం ప్రధాన కార్యదర్శి ముని చంద్రారెడ్డిలు కలిసి అభినందనలు తెలిపారు. అదేవిధంగా పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ తో కలిసి అభినందనలు తెలిపారు.

## పి4 కార్యక్రమంతో ప్రతి ఇల్లు అభివృద్ధి



**శ్రీకాళహస్తి, మేజర్‌న్యూస్:** సీఎం చంద్రబాబు నాయుడు ప్రవేశపెట్టిన కార్యక్రమం ప్రభుత్వ దాతలు, ప్రజలు భాగస్వామ్యం పి4 తో ప్రతి ఇంటికి అభివృద్ధి, ప్రతి జీవితానికి ప్రగతి కార్యక్రమంలో భాగంగా శ్రీకాళహస్తి ఎంఎల్ఏ బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి ఆదేశాల మేరకు మంగళవారం అనగా ఏపీ హౌసింగ్ బోర్డు కాలనీ పానగల్ లో గల సచివాలయంలో ముఖ్య అతిథిగా మున్సిపాలిటీకి చెందిన సీవో స్వాతి సచివాలయం సిబ్బంది చంద్రారెడ్డి, సుధాకర్, మునిలక్ష్మి, సుమలత. 28వ వార్డ్ టీడీపీ పార్టీ అధ్యక్షులు అత్తిరాల భాస్కర్ గౌడ్, తెలుగుదేశం పార్టీ నాయకులు ఆనంద్, జి రవిశంకర్, 29వ వార్డ్ అధ్యక్షులు టీడీపీ గోపి యాదవ్, వెంకటేసులు రెడ్డి, టీ మల్లికార్జున రెడ్డి, వార్డుకు సంబంధించిన రిసోర్స్ పర్సన్స్, మహిళా సంఘం మహిళలు పాల్గొనడం జరిగింది.

## ముస్లింలకు ఇఫ్తార్ విందు ఇచ్చిన షంషీర్



రేణిగుంట, మేజర్‌న్యూస్: రేణిగుంట పంచాయతీ మాజీ వార్డు సభ్యులు ముస్లిం నాయకులు, శ్రీ వరసిద్ధి వినాయక టాక్సీ యూనియన్ అధ్యక్షులు షంషీర్ ఆధ్వర్యంలో ముస్లింలకు ఇఫ్తార్ విందు కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా షంషీర్ మాట్లాడుతూ రంజాన్ మాసంలో రాజోలు ఉంటున్న ముస్లింలకు ఇస్తారు విందు ఇవ్వడం చాలా ఆనందంగా ఉందని అలాగే ముస్లింలకు ముందస్తుగా రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వరసిద్ధి వినాయక టాక్సీ గౌరవ అధ్యక్షులు వెంకటరమణ, సలహాదారులు రసూల్, పలువురు ముస్లింలు టాక్సీ డ్రైవర్లు పాల్గొన్నారు.

## ఆదెమ్మ భౌతికాయానికి నివాళులు



**పలమనేరు, మేజర్‌న్యూస్:** పట్టణ సమీపంలోని గబ్బిళ్ళకోటూరు గ్రామానికి చెందిన ఆదెమ్మ భౌతికాయానికి మంగళవారం ఉదయం పలమనేరు బలిజ అభ్యుదయ సేవా సంఘం( బాస్) అధ్యక్షులు రూపేష్, దైవప్రసాద్, పి జె సి బాబు, కిరణ్, భాస్కర్, శ్యామ్, ఆర్టీసీ సుబ్రహ్మణ్యం, పులింద్రం లక్ష్మీపతి, డాక్టర్ జనార్దన్, సుబ్బ నాగయ్య, గంటవూర్ చంద్రన్న,పుష్పాల వెంకటేశ్వర్లు, సుబ్రహ్మణ్యం తదితరులు వెళ్లి ఆమె మృతికి పూలమాలలు వేసి నివాళులు అర్పించడం జరిగిందన్నారు.

# ఓటర్ల సంఖ్య 1200 దాటితే బైఫర్ కేషన్ చేస్తాం

**- నియోజకవర్గ ఎలక్ట్రో రిటర్నింగ్ అధికారి రోస్ మాండ్**



**పిచ్చాటూరు, మేజర్ న్యూస్:** పోలింగ్ కేంద్రాలకు సంబంధించి ఓటర్ల సంఖ్య 1200 దాటితే బైపర్ కేషన్ చేసుకోవడానికి అవకాశం ఉన్నట్టు సత్యవేడు నియోజకవర్గం ఎలక్ట్రో రిటర్నింగ్ అధికారి,భూసంరక్షణ ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ రోస్ మాండ్ చెప్పారు.మంగళవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో ఇంచార్జ్ తహసిల్దార్ రాజశేఖర్ ఆధ్వర్యంలో ఓటర్ల నమోదు,తొలగింపు,పోలింగ్ కేంద్రాలు తదితరాంశాలపై వివిధ రాజకీయ పక్షాలతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఈఆర్వో రోస్ మాండ్ మాట్లాడుతూ నియోజకవర్గంలో ప్రస్తుతం రెండు లక్షల 14 వేల 992 ఓటర్లు ఉన్నట్టు పేర్కొన్నారు. ఇందులో పురుషులు ఒక లక్ష 4 వేల 146 కాగా,మహిళలు ఒక లక్ష పదివేల 835 మంది ఉన్నారన్నారు.ఈ నేపథ్యంలో 76,418 కుటుంబాలు నియోజకవర్గ స్థాయిలో ఉన్నట్టు ఆమె చెప్పారు.ప్రస్తుతానికి ఓటర్ల సంఖ్య 1200 దాటినవి బుచ్చినాయుడు కండ్రిక మండలం వెస్ట్ వరవత్తూరు, వరదయ్యపాలెం మండలం చీలంపల్లి గ్రామాలు ఉన్నట్టు వివరించారు.తదనంతరం అఖిలపక్షం నేతలు కొన్ని సమస్యలను ఈఆర్వో దృష్టికి తీసుకొచ్చారు.సత్యవేడు మండలం రామచంద్రాపురం ఓటర్లు దాదాపు రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న చెంగంభాకం గ్రామానికి వెళ్లి ఓటు వేసే పరిస్థితి ఉన్నట్టు వైఎస్ఆర్సిపి నాయకుడు శ్రీధర్ రెడ్డి విన్నవించారు. అలాగే కేవిబి పురం మండలం కొండల్లో ఆధవరం ఓటర్లు పేరందేశంకు వెళ్లి ఓటు వేస్తున్నట్టు సిపిఎం మండల నాయకుడు రమేష్ ఈఆర్ఓ దృష్టికి తెచ్చారు. సత్యవేడు ప్రాంతం తమిళనాడుకు సరిహద్దును ఉండటం వల్ల అధికంగా బోగస్ ఓటర్లు నమోదు అయినట్టు బిజెపి నాయకుడు బండారు మోహన్ బాబు విన్నవించారు.సమస్యలపై ఎలక్ట్రో రిటర్నింగ్ అధికారి రోస్ మాండ్ స్పందిస్తూ పోలింగ్ కేంద్రాల బైపర్ కేషన్కు సంబంధించి సమగ్ర నివేదికను పంపాలని ఇంచార్జ్ తహసిల్దార్ రాజశేఖర్ను ఆదేశించారు. ఈ సమావేశంలో పిచ్చాటూరు తహసిల్దార్ టీవీ సుబ్రహ్మణ్యం, స్థానిక రెవెన్యూ డిటి త్యాగరాజ్, డేటాఎంట్రీ ఆపరేటర్ మాధురి, టిడిపి నాయకుడు దిలీప్, వైఎస్ఆర్సిపి నాయకుడు శ్యాం ప్రసాద్ రెడ్డి, బిజెపి నాయకుడు మునికృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఎస్‌డిహెచ్‌ఆర్ విద్యార్థులకు భారీగా ఉద్యోగ అవకాశాలు



**తిరుపతి ప్రతినిధి, మేజర్‌న్యూస్:** తిరుపతిలో న్యూ బాలాజీ కాలనీలోని శ్రీదేవపట్ల హరినాథ్ రెడ్డి డిగ్రీ అండ్ పీజీ కళాశాల (ఎస్‌డిహెచ్‌ఆర్) విద్యార్థులకు భారీగా ఉద్యోగ అవకాశాలు కల్పించినట్లు విద్యాసంస్థల చైర్మన్ డివిఎస్ చక్రవర్తి రెడ్డి తెలిపారు. మంగళవారం ఎస్‌డిహెచ్‌ఆర్ విద్యాసంస్థల ప్రాంగణంలో గ్లోబల్ లాజిక్, స్టార్ హెల్త్ సంస్థలు జాబ్ సెలక్షన్స్ నిర్వహించారు. ఈ జాబ్ సెలక్షన్ తమ కళాశాలలో వివిధ గ్రూపులలో విద్యను అభ్యసిస్తున్న 110 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికైనట్లు ఆ కళాశాల ప్రిన్సిపల్ ఉష తెలిపారు. అలాగే 2024- 25 సంవత్సరములో నిర్వహించిన జాబ్ సెలక్షన్స్ లలో కళాశాలకు చెందిన విద్యార్థులు 500 మందికి పైగా ఉద్యోగ అవకాశాలు పొందినట్లు ఆమె తెలిపారు. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను ఎస్‌డిహెచ్‌ఆర్ విద్యాసంస్థల చైర్మన్ అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రమశిక్షణతో కూడిన ఉద్యమ అందించడంతోపాటు విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పించడమే తమ విద్యాసంస్థల లక్ష్యమని పేర్కొన్నారు.

## తహశీల్దార్ సుడిగాలి పర్యటన



**ఎస్ఆర్ పురం, మేజర్‌న్యూస్:** ఎస్ఆర్ పురం మండలం నుంచి సమస్యలపై కలెక్టర్ కు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందిన అర్జీల పరిష్కా రాలపై తాహసిల్దార్ లోకనాథ పిళ్ళై ప్రత్యేక దృష్టి సారించారు .మంగళవారం మధ్యాహ్నం చిల్లమాకులపల్లి జిల్లా పరిషత్ పాఠశాల స్థలం కొలిచి హద్దులు నిర్ణయించే పరిష్కారంపై గ్రామస్తులతో మాట్లాడి ఫీల్డ్ వెరిఫికేషన్ చేశారు. రికార్డులు పరిశీలించారు.అలాగే పొదలపల్లి ప్రాథమిక పాఠశాల గతంలో పాఠశాల కోసం కేటాయించిన స్థలంలో చౌరబాట్లు ఉండడం.. దీనిపై గతంలో రెండు మూడుసార్లు గ్రామంలో గొడవలు జరగడం ... ఘర్షణ పెరగడంతో దీనిపై దృష్టి సారించి గ్రామంలోకి వెళ్లి పాఠశాలకు స్థలాన్ని పరిశీలించారు. గ్రామ పెద్దలతో మాట్లాడి అలాగే గ్రామం నుంచి ఇళ్ల స్థలాలు కోసం ఎన్ని అర్జీలు వచ్చాయని విఆర్వోని అడిగారు పాఠశాల స్థలంలో ఎవరు ఆక్రమణ చేయకూడదని సూచించారు. అలాగే పి.వి.పురం గ్రామం దళిత వాడికి స్మశానానికి రోడ్డు విషయంలో రోడ్డు ను పరిశీలించారు. కృష్ణాపురం జలాశయం నుంచి ఏరు కాలువ మీదుగా స్మశాన వాటికకు వెళ్లాల్సి ఉంటే ఆ కాలువలో నీరు ఉండటం వల్ల వెళ్ళని పరిస్థితి. పక్కనే ఉన్న నీరులేని పూడ్చివేసిన కాలవ మీదుగా దారి కావాలని గ్రామస్తులు అడగడంతో కాలువను పరిశీలించి ఆ కాలవ కొంత దూరం మాత్రమే ఉండడంతో దీనిపై గ్రామస్తులకు కూర్చుని మాట్లాడి దారి సమస్య పరిష్కరించుకోవాలని అన్నారు .స్మశానానికి వెళ్లే మార్గాన్ని పరిశీలించారు.అన్ని గ్రామాల్లో రికార్డులు పరిశీలించారు రికార్డుల్లో ఉన్న ఆధారంగా గొడవలు లేకుండా పరిష్కరించుకోవాలని గ్రామస్తులకు సూచించారు.

## పేద విద్యార్థుల ఆరోగ్యమే లక్ష్యం



**శ్రీకాళహస్తిఅర్బన్, మేజర్‌న్యూస్:** పేద విద్యార్థుల ఆరోగ్యమే తన లక్ష్యమని ప్రముఖ సంఘ సేవకులు, ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు డాక్టర్ యల్లంపాటి కోటేశ్వరబాబు చెప్పారు. ఈ మేరకు ఆయన మంగళవారం శ్రీకాళహస్తి పురపాలక సంఘం పరిధిలోని అల్లిమడుగు ప్రాథమిక పాఠశాలలో 68మంది, ప్రాజెక్టువీధి పాఠశాలలో 39మంది, చెంచులక్ష్మికాలనీలో 72 మంది. మొత్తం 179 మంది గిరిజన విద్యార్థులకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు, గుడ్ డే బిస్కెట్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ యల్లంపాటి కోటేశ్వరబాబు మాట్లాడుతూ... వేసవి కాలం ప్రారంభం కావడంతో విద్యార్థులు చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రస్తుతం ఒంటిపూట బడి కావడంతో మధ్యాహ్నం వేళ పిల్లలు ఇంటికి వెళ్లే సమయంలో వడదెబ్బకు గురయ్యే ప్రమాదం ఉందన్నారు. అందుకే వైద్యుల సలహా మేరకు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో చదివే విద్యార్థులకు శీతల పానీయాలు, బిస్కెట్లు పంపిణీ చేస్తున్నానని కోటేశ్వరం బాబు చెప్పారు. పేద విద్యార్థుల కోసం మరిన్ని సేవలు చేయాలన్నదే తన ఆశయమని కూడా ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో పాఠశాలలు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## పాపులరిటీ కోసం పవన్ కళ్యాణ్ పై విమర్శలు తగదు



**పెళ్లకూరు, మేజర్‌న్యూస్:** పాపులరిటీ కోసం వైసీపీ నాయకులు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పై విమర్శలు తగవని జనసేన పార్టీ మండల అధ్యక్షులు విజయ్ మల్లాం అన్నారు.ఈ సందర్భంగా మండలంలోని చెంబేడు గ్రామం నందు ఏర్పాటు చేసిన విలేకరుల మాట్లాడుతూ 5 సంవత్సరాలలో అధికారంలో కనీసం జనాలకు చేసింది ఏమి లేక వైసీపీ జిల్లా ఉపాధ్యక్షులు తంబిరెడ్డి సుబ్రహ్మణ్యం రెడ్డి అవాకులు చెవాకులు పెలుతుంటే హాస్యాస్పదంగా ఉందన్నారు.151నుండి 11 సీట్లకు పరిమితం అయి ఏమి మాట్లాడాలో తెలియక కేవలం పబ్లిసిటీ కోసం వైసీపీ పాకులడుతూ ఉందన్నారు.సుబ్రహ్మణ్యం రెడ్డి ఎవరో కనీసం పక్కింటి వాళ్లకు తెలీదన్నారు. ఇప్పటికి అయినా మా నాయకుడిని విమర్శించడం మానుకోవాలన్నారు.

## మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ న్యాయవాదిగా మునిరాజులు



**పలమనేరు, మేజర్‌న్యూస్:** పలమనేరు మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ న్యాయవాదిగా మునిరాజులు నియమితులయ్యారు. మంగళవారం పలమనేరు మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి నియామక పత్రం అందించారు. న్యాయవాది మూడు సంవత్సరాలు ఇప్పటి నుండి స్టాండింగ్ కౌన్సిల్‌గా విధులు నిర్వహిస్తారు. మున్సిపల్ శాఖకు సంబంధించిన కేసులన్నీ పర్యవేక్షిస్తారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాకు ఈ పదవి రావడానికి సహకరించిన ఎమ్మెల్యే అమర్నాథ్‌రెడ్డికి అలాగే పలమనేరు మున్సిపల్ చైర్పర్సన్‌కు మున్సిపల్ కౌన్సిల్ సభ్యులకు అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. నాపై నమ్మకం ఉంచి ఈ పదవి రావడానికి కృషి చేసిన సహకరించిన వారందరికీ ధన్యవాదాలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ పదవికి తన వంతు సహాయం అందించి మంచి సేవలు అందిస్తానని తెలిపారు. పలమనేరు న్యాయవాదులు ఆయనకు ఈ పదవి రావడంతో ప్రత్యేకంగా అభినందనలు తెలియజేశారు.

# నిప్పు రగిలితే.. ఆర్పేదెవరు సారూ..?



(మొదటిపేజీ తరువాయి)

అగ్నిమాపక కేంద్రాల దుస్థితి చూస్తే అర్థమవుతోంది. అగ్గి రేగితే ఆస్తులు బుగ్గి అవు తున్నా.. అగ్నిమాపక వ్యవస్థను పటిష్ఠం చేయడంపై ప్రభుత్వం పెద్దగా దృష్టి సారించడం లేదనే చెప్పాలి. వేసవి అగ్ని ప్రమాదాలకు అవకాశం ఎక్కువగా ఉండేకాలం. అయితే జిల్లాలో అగ్ని మాపకశాఖ పరిస్థితి అధ్వానంగా ఉంది. సిబ్బంది కొరత.. సౌకర్యాల లేమి.. డొక్కు వాహనాలతో అగ్ని ప్రమాదాలను వంద శాతం నివారించలేని విధంగా ఉంది. జిల్లాలోని పలు అగ్ని మాపక కేంద్రాల వారి పరిధిలో పదుల సంఖ్యలో గ్రామాలున్నాయి. దీంతో ప్రమాదాల సమయంలో అగ్నిమాపక యంత్రం అక్కడకు వెళ్లే సరికి జరగాల్సిన నష్టం జరిగిపోతోంది. పలు కేంద్రాల్లో నీటి సౌకర్యం కూడా లేదు. దీంతో ప్రమాదం జరిగిందన్న సమాచారం వస్తే నీటి కోసం, డ్రైవర్ కోసం అన్వేషణ చేయాల్సిన పరిస్థితి ఉందంటే ఆశ్చర్యం కాదు. ప్రమాదాలకు, దూరాన్ని బట్టి అగ్నిమాపక కేంద్రాలు నుంచి అగ్నిమాపక యంత్రం సమయానికి రాలేక పోతుంది.

దీనికి తోడు సౌకర్యాల కొరత, మరమ్మతులతో మొరాయించే ఫైర్ ఇంజన్లు నిదర్శనంగా కనిపిస్తాయి. జిల్లా అవి కూడా అత్యాధునికంగా ఉన్నాయా అంటే అనుమానమే. ఎప్పుడో దశాబ్దాల క్రితం ఏర్పాటు చేసిన అగ్నిమాపక కేంద్రాలు.. ఏళ్ల క్రితం కేటాయించిన ఫైర్ ఇంజన్లతో అరకొర సేవలతో కాలం వెళ్లదీస్తున్నాయి. అగ్నిమాపక కేంద్రం పరిధిలో పదుల కిలోమీటర్ల దూరంలో జరిగే ప్రమాదాలకు వాహనాలు వెళ్లే సరికి ఆస్తులు బుగ్గవుతున్నాయంటే జిల్లాలో పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ప్రతి ఏటా అగ్ని ప్రమాదాల్లో కోట్లాది రూపాయల ఆస్తులు బుగ్గి పాలవుతున్నా సమస్యలతో వెంటాడుతున్న అగ్ని మాపక శాఖ వాటిని కాపాడలేకపోతోంది. అత్యంత కీలక మైన అగ్నిమాపక శాఖను ప్రభుత్వం గాలికి వదిలేసిందని చెప్పవచ్చు. వాహనాల మరమ్మతులకు అగ్ని మాపక శాఖ నుంచి నిధులు విడుదల కావడం లేదు. జిల్లాలో ఏ మూల ఏ ప్రమాదం జరిగినా ఆ ప్రాంతానికి దగ్గరలో ఉన్న ఫైర్ ఇంజన్ వెళ్లడానికే చాలా సమయం పడుతోంది. తగినన్ని ఫైర్ స్టేషన్లు, వాహనాలు లేక, సిబ్బంది లేక ప్రజలను ప్రమాదాల నుంచి కాపాడాల్సిన అగ్నిమాపక శాఖే ప్రమాదంలో ఉంది. అత్యంత ప్రాధాన్యం కలిగిన అగ్ని మాపక శాఖపై పాలకులు అలసత్వాన్ని ప్రదర్శిస్తుండటంపై ప్రజలు ఆగ్రహిస్తున్నారు.

తిరుపతి జిల్లాలో 12 అగ్నిమాపక కేంద్రాలున్నాయి. అందులో తిరుపతి అగ్నిమాపక కేంద్రంలో మాత్రమే 54 మీటర్ల ఎత్తులో ఫైర్ చేసే వాహనం ఉంది మిగతా 11అగ్నిమాపక కేంద్రాల్లో మామూలు ఫైర్ ఇంజన్లతోనే ప్రమాదాలను అదుపు చేస్తున్నారు. నిబంధనల మేరకు 50వేల జనాభాకు ఒక శకటం అవసరం. అయితే జిల్లాల్లో ఎక్కడా కూడా ఆ పరిస్థితి లేదు. పదిహేనేళ్ల క్రితమే అగ్నిమాపక కేంద్రాలతో పాటు, ఉన్న వాటిలో రెండో శకటం కోసం ప్రతిపాదనలు రూపొందించారు. అయితే ఏళ్లు గడుస్తున్నా కొత్తగా కేంద్రాల మంజూరును పక్కన పెడితే ఫైర్ ఇంజన్ల ఊసే లేదు. దీంతో వేసవిలో అత్యధిక ప్రమాదాలు జరిగే ప్రాంతాల్లో మంటల్లో ఆస్తులు మాడి మసువుతున్నాయి. సంఘటన జరిగిన సమయాల్లో నాయకులు, అధికారులు కంటి తుడుపు చర్యగా బాధితులకు సాయం అందించి చేతులు దులుపు కుంటున్నారే కానీ అగ్నిమాపక వ్యవస్థను పటిష్ఠం చేసేందుకు కనీస ప్రయత్నాలు కూడా చేయడంలేదు. ఎక్కడైనా అగ్ని ప్రమాదం జరిగితే అగ్నిమాపక శకటం చేరేసరికి పూర్తి నష్టం వాటిల్లుతుంది. జిల్లాలో అనేక మండలాల్లో ఫైర్ ఇంజన్లు అందుబాటులో లేవు. అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందినా వారు అక్కడకు వెళ్లేప్పటికి మంటల్లో ఆస్తులు బూడిదగా మారుతున్నాయి. ఎక్కడైనా ఒకే సమయంలో రెండు ప్రాంతాల్లో మంటలు అంటుకుంటే ఒకటి పూర్తిగా నష్టపోవాల్సిన పరిస్థితి నెలకొన్న సంఘటనలు చాలానే ఉన్నాయి.

**వేధిస్తోన్న సిబ్బంది కొరత...** అగ్నిమాపక శాఖలో సిబ్బంది కొరత వేధిస్తోంది. ఒక్కో కేంద్రంలో లీడింగ్ ఫైర్మెన్లు ముగ్గురు, ఫైర్మెన్లు 9మంది, డ్రైవర్లు ముగ్గురు, ఒక స్టేషన్ ఆఫీసరు ఉండాలి. అయితే ఏ స్టేషన్లోనూ 40శాతం మంది సిబ్బంది కూడా లేరు. ఈ పరిస్థితుల్లో అగ్నిమాపకే కేంద్రానికి సమాచారం అందిస్తే.. అది చేరుకునేలోగా నష్టం జరిగి పోతుంది. ప్రమాద స్థలికి చేరుకోవడంలో కీలకంగా ఉండే డ్రైవర్లు ఏ స్టేషన్‌లోనూ లేరంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో ఊహించుకోవచ్చు. ఏళ్లుగా సిబ్బంది భర్తీకి నోచుకో లేదు. తాత్కాలిక ప్రాతిపదికన హోం గార్డులను తీసుకున్నా వారు పని నేర్చుకోలేక వారితో అధికారులు సతమత మవుతున్నారు.

## ఇంటి స్థలం కోసం దరఖాస్తుల ఆహ్వానం

### కమిషనర్ ఎన్.మౌర్య



**తిరుపతి బ్యూరో, మేజర్‌న్యూస్:** తిరుపతి నగరంలో ఇంత వరకు ఎటువంటి హౌసింగ్ స్కీంలో లబ్ధిపొందని అర్హులైన లబ్ధిదారుల నుండి ప్రధాన మంత్రి ఆవాస్ యోజన 2.0 పథకం కింద దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు నగర పాలక సంస్థ కమిషనర్ ఎన్. మౌర్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన వారు ఈనెల 31వ తేదీలోపు దగ్గరలో ఉన్న వార్డ్ సచివాలయంలో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఇంతవరకు ఏటువంటి హౌసింగ్ స్కీమ్స్‌లో అంటే, టిడ్కో హౌసింగ్, నవరత్నాలు హౌసింగ్, దామినేడు, పాడిపేట, బాలాజీ డైరీ, తనపల్లి, వికృతమాలతో పాటు ప్రభుత్వ సబ్సిడీ ద్వారా సొంతంగా ఇల్లు నిర్మించికున్న లబ్ధిదారులు కాకుండా, మిగతా వారు అర్హులని తెలిపారు.

తిరుపతి నగరంలో అర్హులైన లబ్ధిదారుల నుండి డిమాండ్ సర్వే ద్వారా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని తెలిపారు. లబ్ధిదారులు మీ దగ్గరలో ఉన్న సంబంధిత వార్డు సచివాలయంలో అమెనిటి సెక్రెటరిని కలసి, లబ్ధిదారుల భార్య, భర్త ఆధార్ కార్డులు, రేషన్ కార్డు, కులం సర్టిఫికెట్, 3 లక్షల లోపు ఆదాయ ధ్రువీకరణ సర్టిఫికెట్, బ్యాంక్ అకౌంట్ పాస్ బుక్, తదితర పత్రాలను సమర్పించి దరఖాస్తు చేసుకోవాలని కమిషనర్ ఆ ప్రకటనలో తెలిపారు.

## అంతర్ జిల్లా దొంగల ముఠా అరెస్ట్



(మొదటిపేజీ తరువాయి)

పూతలపట్టు పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఇ.క్రిష్ణ మోహన్ సిబ్బందితో కలిసి ఒంటరి మహిళ మెడలో బంగారు చైనులు, ద్విచక్రవాహనాలు, ఆలయాలు, ఇళ్ళలో చోరీలకు పాల్పడుతున్న ఐదుగురు అంతర్ జిల్లా దొంగల ముఠాను అదుపులోకి తీసుకున్నారని వెల్లడించారు. వారి నుంచి రూ 35 లక్షల విలువ గల 316 గ్రాముల బంగారు ఆభరణాలు, 3.150 కిలోల వెండి వస్తువులు, రెండు ద్విచక్రవాహనాలు, ఒక టివిని స్వాదీనం చేసుకోవడం జరిగిందన్నారు.

దొంగతనాలకు ప్రధాన కారకుడైన హేమ చంద్రపై సుమారు 60 కేసులు ఉన్నాయని, ఇతనిపై 20 వారెంట్లు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. రెండవ ముద్దాయి సురేష్ పై సుమారు 27 కేసులు ఉన్నాయని, 2022 వ సంవత్సరంలో ఏ-1, ఏ-2 ముద్దాయిలపై గాజులమాండ్యం పోలీస్ స్టేషన్ పరిధిలో పీడీ యాక్ట్ సైతం నమోదు చేయడం జరిగిందన్నారు. మూడవ ముద్దాయి షేక్ మస్తాన్ పై సుమారు 57 కేసులు ఉన్నాయని వివరించారు. అదే విధంగా 4వ ముద్దాయి పోలి వరప్రసాద్, 5 వ ముద్దాయి సంజయ్ కుమార్ లను అరెస్టు చేయడం జరిగిందన్నారు. వీరిపై చిత్తూరు జిల్లాతో పాటుగా కడప, కావలి, కర్నూల్, బద్వేల్ ఇతర పోలీస్ స్టేషన్లలో పలు కేసులు ఉన్నాయన్నారు. దొంగలను కోర్టులో హాజరు పరచనున్నట్లు ఎస్పీ తెలిపారు.

## జాతీయ రహదారుల భూసేకరణ, నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలి

### కలెక్టర్ డా. ఎస్ వెంకటేశ్వర్



**తిరుపతి బ్యూరో, మేజర్‌న్యూస్:** జిల్లాలో జాతీయ రహదారులకు సంబంధించిన భూసేకరణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డా ఎస్ వెంకటేశ్వర్ తెలిపారు. బుధవారం స్థానిక కలెక్టరేట్ లోని సమావేశ మందిరం నందు జాతీయ రహదారి భూసేకరణ పురోగతి పనులపై జిల్లా కలెక్టర్ డా ఎస్ వెంకటేశ్వర్ జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ తో కలిసి వర్చువల్ విధానంలో నేషనల్ హైవే పిడిలు, సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, తిరుపతి, శ్రీకాళహస్తి, సూళ్లూరుపేట ఆర్డీఓలు రామ్మోహన్, కిరణ్మయి, భాను ప్రకాష్ రెడ్డి సంబంధిత మండలాల తాసిల్దార్లు తో సమీక్ష సమావేశం నిర్వహించారు కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం జాతీయ రహదారులు నిర్మాణాలకు ఎంతో ప్రాధాన్యతను ఇస్తుందన్నారు. జిల్లాలో నిర్మితమవుతున్న పలు ప్రాజెక్టులు, జాతీయ రహదారుల సేకరణకు సంబంధించి పనులను ప్రాధాన్యత తీసుకొని వేగవంతంగా పూర్తి చేయాలని తెలిపారు. దీనికి సంబంధించి రెవెన్యూ డివిజన్ అధికారులు, తాసిల్దారులు, జాతీయ రహదారుల అధికారులతో సమన్వయం చేసుకొని పని చేయాలన్నారు. జాతీయ రహదారి భూసేకరణ పనులు త్వరిత గతిన పూర్తికావడానికి ప్రణాళికను రూపొందించుకొని పూర్తి చేయాలన్నారు. జాతీయ రహదారుల నిర్మాణ పనులు పురోగతి ఉన్న రహదారి విస్తరణ పనులు కూడా వేగంగా చర్యలు తీసుకోవాలని భూ సేకరణకు సంబంధించిన పెండింగ్ పనులలో సంబంధిత ఆర్డీవోలు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. భూసేకరణ పెండింగ్ అవార్డు సంబంధించిన పనులు త్వరగా పూర్తి చేయాలని తెలిపారు. ప్యాకేజీ 2,3,4 జాతీయ రహదారి పనులు సాగరమాల కింద చేపట్టిన ఎటువంటి అలసత్యం లేకుండా వెంటనే పనులు పూర్తయ్యేలా రెవెన్యూ డివిజనల్ అధికారులు, ఎన్ హెచ్ అధికారులు సమన్వయంతో నిర్దేశించుకున్న గడువులోగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. రైల్వే ప్రాజెక్టులు నడికుడి శ్రీకాళహస్తి ప్రాజెక్ట్ కు సంబంధించిన భూ సేకరణ పనులు పూర్తయ్యేలా ఆర్డీఓలు, తాశిల్దార్లు చర్యలు తీసుకోవాలని తెలిపారు.తిరుపతి రేణిగుంట బైపాస్ సంబంధించిన పెండింగ్ భూ సమస్యలను పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకోవాలని ఆర్డీఓ లను ఆదేశించారు. ఈ సమావేశంలో తిరుపతి, నెల్లూరు, చెన్నై నేషనల్ హైవే పి డీలు తిరుపతి వెంకటేష్, ఎం కె చౌదరి, రవీంద్రరావు, తదితరులు పాల్గొన్నారు.

జనం కోసమే
నేటి దినపత్రిక సూర్య

మీ అభిప్రాయాలే మా కథనాలు
నేటి దినపత్రిక సూర్యకు పాఠకులే మార్గదర్శకులు, ప్రచురితమయ్యే ప్రతి కథనం, రోజువారి వార్తలపై మీ అభిప్రాయాలను మా దృష్టికి తీసుకువస్తే మరింత శ్రద్ధగా మీ అందరి ఆదరణ పొందేలా కృషి చేస్తామని ముకుళిత హస్తాలతో వేడుకుంటున్నాం.
మరింత సమాచారం అందించాల్సిన వారు ఎప్పుడైనా మీ అభిప్రాయాలను క్లుప్త ంగా తెలియచేయాలని, మీకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటామని తెలియచేస్తున్నాం.

కె.సురేష్‌బాబు (బ్రాంచ్ మేనేజర్) ఫోన్ నెంబర్ : 9346318232
ఎన్.లక్ష్మినారాయణ (రీజనల్ మేనేజర్) ఫోన్ నెంబర్ : 6301107116

